
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

3

బుధవారం 29 జనవరి 2025





● వినుకొండ కొట్నాల్ల వీధిలో కాలువలను పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ప్రజలు

# ఆంధ్రజ్యోతి వేదికగా.

# అభయం

## ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం సుగుమం

- త్వరలో పనులు చేపడతామని చీఫ్‌విప్ ఆంజనేయులు హామీ
- సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన..
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- వినుకొండలో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాకు విశేష స్పందన

ఏళ్లుగా సమస్యలతో అల్లాడుతున్న ప్రజలకు ఆంధ్రజ్యోతి అండగా నిలిచింది. వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి వేదికగా ప్రజాప్రతినిధుల నుంచి అభయం వచ్చింది. అధికారులు.. ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకే తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం ఆంధ్రజ్యోతి కల్పించగా ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా అంధ్రజ్యోతి ముందడుగు వేయగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు హామీ ఇవ్వగా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వినుకొండ మున్సిపాలిటీ పరిధిలోని కొట్నాల్ల వీధి, గాయత్రీనగర్‌లో మంగళవారం ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు స్థానిక నేతలు, అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో వీధివీధినా పర్యటించి సమస్యలను పరిశీలించి, ప్రజల బాధలను విన్నారు. తమ సమస్యలు పరిష్కారంపై హామీలు రావడంపై ప్రజల నుంచి హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి.



వినుకొండ గాయత్రి నగర్‌లో సీసీ రోడ్లు నిర్మించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు




గాయత్రి నగర్ శివారులో నిలిచిపోయిన రక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు



### ఇవీ సమస్యలు..

- **కొట్నాల్ల వీధిలో :** డ్రెయిన్లు నిర్మించాలని మహిళలు కోరారు. తాగునీటి సరఫరాను మెరుగు పరచాలన్నారు. గతంలో తాగునీటి పైపులైన్ కోసం సిమెంట్ రోడ్డు పగులగొట్టి వదిలేశారని వాటిని బాగు చేయాలని స్థానికులు కోరారు.
- **గాయత్రీనగర్:** నగర్ కాల్వ కట్ట మొదటి వీధిలో సిమెంట్ రోడ్డు వేయాలని మహిళలు కోరారు. మురుగు కాల్వలు నిర్మించి మురుగునీటి అవస్థలు తొలగించాలన్నారు. రాకపోకలకు ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. మరో వీధిలో రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి పైపులైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.
- **32వ వార్డు:** జాలలపాలెం డొంకరోడ్డు గుంతలమయంగా మారిందని, కనీసం పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు పడితే అల్లాడుతున్నామని రెడ్డినగర్‌లో వాసులు తెలిపారు. నిధులు లేమితో జాలలపాలెం పంచాయతీ సమస్యలను పరిష్కరించడంలేదన్నారు. తమ ప్రాంతాన్ని మున్సిపాల్టీలో విలీనం చేయాలని కోరారు.
- గాయత్రీనగర్‌లో జరిగిన కార్యక్రమానికి రెడ్డినగర్‌కు చెందిన సుమారు 50మందికి పైగా మహిళలు వచ్చి జీవీకి సమస్యలపై అర్జీలు ఇచ్చారు.

వినుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపాల్టీలోని 23, 31 వార్డుల్లో మంగళవారం ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆంధ్రజ్యోతి వేదికగా బాధిత ప్రజలు సమస్యలపై గళం




వినిపించారు. గాయత్రీ నగర్, కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరై ప్రజా సమస్యలను పరిశీలించి, వారి గోడు విన్నారు. ఆయనకు ప్రజలు అర్జీలను అందజేయగా సమస్యల పరిష్కారానికి అభయం ఇచ్చారు. 23, 31 వార్డుల పరిధిలోని గాయత్రీనగర్, విష్ణుకుండినగర్, రెడ్డినగర్ కొత్తగా ఏర్పాటైన కాలనీవాసులు సమస్యలను జీవీకి చెప్పగా, వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. కొట్నాల్ల వీధిలో జరిగిన కార్యక్రమంలో మహిళలు మాట్లాడుతూ ఐదేళ్ల ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. కొట్నాల్ల ప్రాంతంలోని వీధుల్లో జీవీ పర్యటించి అధ్వానంగా ఉన్న రోడ్లు.. మురుగు కాల్వలను పరిశీలించారు. పగిలిపోయిన రోడ్లను, పూడిపోయిన డ్రెయిన్లను చూసి జీవీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జీవీ ఆదేశాలతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి అంచనాలను రూపొందించేందుకు మున్సిపాలిటీ సిద్ధమైంది. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ షేక్ నన్నెసా, పఠాన్ అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు. గాయత్రీనగర్‌లో కూడా జీవీ వీధుల్లో పర్యటించారు. మహిళలు ఎక్కడికక్కడ సమస్యలకు సంబంధించిన అర్జీలను జీవీకి అందజేశారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం తన కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టకుండా కక్షసాధింపులా వ్యవహరించిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏఐబీ నిధులతో తాగు నీటి పథకం నిర్మాణం చేపట్టగా ప్రస్తుతం నిలిచిపోయిన ఓవర్ ట్యాంకు పనులను జీవీ పరిశీలించారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పనులను నిలిపివేసిందని స్థానికులు జీవీకి తెలిపారు. వెంటనే సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, ఎన్ఎస్పీ కాల్వపై బ్రిడ్జి, వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ దస్తగిరి, కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌లను జీవీ ఆదేశించారు. కాలవ్యవధి నిర్దేశించుకుని ఆయా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## రూ.5 కోట్ల విరాళం ఇస్తా

- ప్రభుత్వం నుంచి రూ.95 కోట్లు కోరతా
- వంద కోట్లతో వినుకొండ అభివృద్ధికి కృషి చేస్తా
- గాయత్రినగర్‌లో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రకటన

జన్మభూమి రుణం తీర్చుకునేందుకు రాజకీయాల్లో వచ్చానని, జన్మభూమి అభివృద్ధి కోసం శివశక్తి ఫౌండేషన్ ద్వారా రూ.5 కోట్లు విరాళం ఇస్తానని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గాయత్రీనగర్‌లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా వేదికపై ఈ మేరకు జీవీ ప్రకటించారు. ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు కింద రూ.95 కోట్లను ముఖ్యమంత్రి చంద్రబాబును కోరతానన్నారు. నిధులు సాధించి రూ.100 కోట్లతో వినుకొండను అభివృద్ధి చేస్తానని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే, అధికారులు చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కారం కాలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి తాను బాధ్యత తీసుకుంటానని చెప్పారు. నాడు టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.189 కోట్లతో తాగు నీటి పథకం చేపడితే వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తి చేయలేదన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసం, శాంతి భద్రతల కోసం ఉపయోగిస్తామన్నారు.

### ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం

ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావడం కోసం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిస్కారమే అజెండాగా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలతో ప్రజలకు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మధ్య అవినాభావ సంబంధం పెరుగుతుందన్నారు. సమస్యల్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పష్టంగా అర్థం చేసుకునేందుకు, పరిష్కారానికి ఓ మార్గం దొరుకుతుందన్నారు. మంచి పనులు చేస్తామని, అభివృద్ధి చూపిస్తామని, వాటిని మళ్లీ ప్రజల దృష్టికి ఆంధ్ర జ్యోతి తీసుకువెళ్లాలని కోరారు.





సభలో ప్రసంగిస్తున్న జీవీ ఆంజనేయులు, హాజరైన ఆయా కాలనీల ప్రజలు



రథోత్సవానికి హాజరైన భక్తజన సందోహం

# జై..శ్రీఆంజనేయం

- అట్టహాసంగా ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం
- వైభవోపేతంగా శ్రీసీతారాముల కల్యాణం
- తిరునాళ్ల భక్తులతో కిక్కిరిసిన పిడుగురాళ్ల
- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జై.. ఆంజనేయ. జైజై.. శ్రీఆంజనేయం అనే భక్తుల నినాదాలతో మంగళవారం పిడుగురాళ్ల మారుమోగింది. ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల, రథోత్సవంతో పిడుగురాళ్ల కిటకిటలాడింది. తిరునాళ్లలో భాగంగా మూడు రోజులుగా స్వామివారికి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు అట్టహాసంగా జరిగాయి. మంగళవారం స్వామిని పంచముఖ అంజనేయస్వామిగా ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం జరిగింది. పట్టణంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తిరునాళ్ల పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసందోహం మధ్య ఎమ్మెల్యే రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాటి ఇలవేల్పు అయిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, గురజాల డీఎస్పీ జగదీష్, తహసీల్దార్ మధుబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు, కనిగిరి శ్రీను, పాండురంగ శ్రీను, దేవాలయ అధ్యక్షులు కాకుమాను మల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, గుండా అశోక్ బాబు, పెరుమాళ్ల రాజేష్, కోట హరి, జూలకంటి సుబ్రహ్మణ్యం, ఎల్‌వీఆర్, బొల్లా శ్రీను, డివి స్వామి, కామిశెట్టి శ్రీను, కొక్కెర కొండలు, దూదేకుల ఖాశిం, వాయిరి వెంకట్రావు, వడ్డవల్లి సాంబశివరావు, గుండా నారాయణరావు, నల్లపాటి శ్రీను, అర్చకులు వేదాంతం రామ్మోహన్‌రావు, అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నిఖిల్ తదితరులు

# నిషేధమా అదెక్కడ ?

- జిల్లాలో ఎక్కడా అమలు కాని ప్లాస్టిక్ నిషేధం
- తనిఖీలు మరచిన అధికారులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్లాస్టిక్ పర్యావరణానికి విఘాతం కలిగిస్తోంది. ప్రాణకోటికి సంకటకంగా మారిన ప్లాస్టిక్ అరికట్టేందు కు నామమాత్రపు చర్యలు కూడా పల్నాడు జిల్లాలో అమలు కావడంలేదు. పట్టణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పోటేత్తుతున్నాయి. మునిసిపల్ అధికారులు తనిఖీల ను పూర్తిగా మరిచారు. తిరిగి వాడుకునేందుకు పని కిరాని. ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌తో తయారు చేసి న పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ సీసాలు, గ్లాసులు ఇలా 18 రకాలపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. నిషేధాన్ని క్షేత్ర స్థాయిలో ఆధికార యంత్రాంగం అమలు చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ఆరికట్టడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. నిషేధం అమల్లోకి వచ్చి ఏడాది గడిచినా యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ విని యోగం, విక్రయాలు సాగుతున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తున్నది. నిషేధిత ప్లాస్టిక్ జాబితాలో 75 మైక్రాన్లలోపు మందం ఉన్న క్యారీ బ్యాగులతో పాటు 50 మైక్రాన్ల లోపు మందం ఉన్న ప్లాస్టిక్ షీట్లు, పాన్ మసాలా ప్యాకెట్ల తో పాటు మరో 18 రకాల ప్లాస్టిక్ ఉత్పత్తులను చేర్చారు. ఒక్కసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ గ్లాసులు, కప్పులు, స్పూన్లు, స్ట్రాలు తదితరాలన్నీ నిషేధిత జాబితాలో ఉన్నాయి.

పల్నాడు జిల్లాలోని పట్టణాలు ప్లాస్టిక్ మయమయ్యాయి. ఇదే పరిస్థితి పల్లెల్లోనూ నెలకొంది. విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నది. ఉదయం పాల ప్యాకెట్‌ల నుంచి ప్లాస్టిక్ వినియోగం ప్రారంభమవుతున్నది. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను నిత్యం వేల సంఖ్యలో వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంపై మునిసిపాలిటీలు, పంచాయతీలు, సచివాలయాల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో వ్యాపారులు యథేచ్ఛగా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తూనే విక్రయాలు జరుపుతున్నారు. పట్టణాలలో మురుగు కాలువలు ప్లాస్టిక్ మయమవుతున్నాయి. ఏ కాలువ నిండా చూసినా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కన్పిస్తున్నాయి. కాలువల్లో పూడిక తీసే సమయంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ కవర్లు, సీసాలు, గ్లాసులు ఉంటున్నాయి. కూరగాయలు, సరుకులు, పండ్లు ఇలా ఏమి కొనుగోలు చేసినా ప్రజలు ప్లాస్టిక్ సంచులనే వినియోగిస్తున్నారు. ఈ కవర్ల వినియోగంపై నియంత్రణ కన్పించడం లేదు. విందు, వినోదాలలో కూడా ప్లాస్టిక్ గ్లాసులు, పేపర్ సామాగ్రిని వినియోగిస్తున్నారు. చివరకు కూరలు, ఆహారం ప్యాకింగ్‌లో కూడా ప్లాస్టిక్ పేపర్, కవర్లను వాడుతున్నారు. వేడి అహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ చేయడం వలన అవి కరిగి ఆహారంలో కలసిపోతూ ప్రాణ సంకటంగా మారుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన చట్టాలను అమలు చేయడంలో అధికారులు వెనకడుగు వేస్తుండటం సర్వత్రా విమర్శలకు దారి తీస్తున్నది. ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే రీతిలో ప్లాస్టిక్ వినియోగం జరుగుతున్నది. అధికారులు చర్యలు తీసుకోవడం మాట ఎలా ఉన్నా ఎవరికి వారు ప్లాస్టిక్ వినియోగంపై స్వీయ నియంత్రణ అవసరం. ప్రజా చైతన్యంతోనే ప్లాస్టిక్ వినియోగాన్ని జిల్లాలో అరికట్టే అవకాశం ఉంటుంది.



నరసరావుపేటలో ప్రధాన మురుగు కాలువ నిండా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు

# దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

- మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
- దాతృత్వానికి మారుపేరుగా మారాలి

4





ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్లు, భక్తులు



జిల్లా పరిషత్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

## విద్యార్థులూ.. కష్టపడి చదువుకోండి

● కలెక్టర్ అరుణ్‌బాబు



రాజుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

రాజుపాలెం,జనవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మండల కేంద్రం రాజుపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ హైస్కూల్లోని రికార్డులను పరిశీలించారు. కీర్తన అనే బాలిక ఎందుకు రావడం లేదని హెచ్ఎం శైలజను అడిగారు. చాలారోజుల నుంచి ఆ విద్యార్థిని రావడం లేదని ఆమె సమాధానమిచ్చారు. ఎందుకు రావడం లేదో తెలుసుకోవాలని డీఈఓ చంద్రకళకు సూచించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థుల తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో కొంచెం సేపు ముచ్చటించారు. తరగతి గదిలో చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా లేదా అని వారిని అడిగారు. 'బాగా చదువుతున్నారా? మీకు మెటీరియల్ ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు. నలు గురు విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు రావ డం లేదని, ద్విచక్రవాహనంపై తిరుగుతున్నారని కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయులు తీసుకెళ్లారు. సదరు విద్యార్థులను హెచ్ఎం గదికి కలెక్టర్ పిలిపించారు. బాగా చదువుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని వారికి చెప్పిన కలెక్టర్, చదువు ప్రాము ఖ్యత గురించి వివరించి చెప్పారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీ పెద్ది రాజు, చారి, పీ సాంబయ్యలు ఆ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామాకాంత్‌రెడ్డి ఉన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 553.90 అడుగులు ఉంది. ఇది 218.45 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6791 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 16,800 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 35,638 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.





# ఇబ్బంది వద్దు.. అండగా ఉంటా

● ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరించిన మంత్రి నారా లోకేశ్ హామీ





ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

తాడేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ మంగళవారం నాటికి 58వ రోజుకు చేరింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ లోకేశ్‌కు అర్జీలు ఇవ్వగా, వాటిని ఆయన పరిశీలించారు. 'ఇబ్బంది వద్దు.. అండగా ఉంటా'నని వారికి ఆయన హామీ ఇచ్చారు.

### మదర్సాలలో విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించండి

మదర్సాలలో పని చేస్తున్న విద్యా వలంటీర్లను క్రమబద్ధీకరించడంతోపాటు గత వైసీపీ పాలనలో పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని గుంటూరు మదర్సా విద్యావాలంటీర్లు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య పేరుతో ఉన్న నాలుగు ఎకరాల పొలాన్ని తన పేరుతో ఆన్‌లైన్ చేయాలని సత్తెనపల్లి మండలం రెంటపల్లికి చెందిన రామ్ గోపాల్ మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తన భార్య రెండేళ్ల క్రితం రెండేళ్ల క్రితం కేన్సర్‌తో చనిపోయిందని, ఆమె పేరుపై ముదుకొండపాలెంలో నాలుగు ఎకరాల పొలం ఉందని అధికారులకు చెప్పినప్పటికీ హక్కులు కల్పించలేదని విజ్ఞప్తి చేశారు.

### సమ్మర్ స్టోరేజి నిర్మాణం పూర్తి చేయండి

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సమ్మర్ స్టోరేజి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గం సంతెకుడ్లూరు గ్రామస్తులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. తాగునీటి సమస్యను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, ఎగువ ప్రాంతానికి తాగు నీటి సరఫరా కోసం రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులు మంజూరు చేయాలని కోరగా పరిశీలించి తగు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో బహుజనులకు సంబంధించి రద్దు చేసిన 26 సంక్షేమ పథకాలను పునరుద్ధరించడంతోపాటు ఉద్యమకారులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఏలూరుకు చెందిన బహుజన సేవా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎల్‌జీఎస్‌గా పని చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ డేటా ఎంట్రీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, తిరుపతి టీఎస్‌టీ యూనీ అనుబంధ సంస్థ శ్రీవెంకటేశ్వర ఆటో టాక్సీ వర్కర్స్ యూని యన్ సభ్యులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని యూనియన్ ప్రతినిధులు కోరారు. చిత్తూరు జిల్లా ఐరాల మండలం, పోలకల పంచాయతీలోని జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలని పాఠశాల యాజమాన్య కమిటీ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు నాలుగు కిలోమీటర్ల దూరంలోని ఎర్రచెరువుపల్లి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా రాయచోటిలో నివాసం ఉండే తాము 5 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపసాగు చేయగా నష్టం వచ్చిందని దీంతో గ్రామంలో ఆరు లక్షల వరకు అప్పులయ్యాయని విజయవాడవచ్చిన తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# దేవుని సన్నిధిలో.. సంపూర్ణ సంతోషం

● బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్
● దాతృత్వానికి మారుపేరుగా మారాలి



మాట్లాడుతున్న శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 28(ఆంధ్రజ్యోతి): దేవుని సన్నిధిలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరికీ సంపూర్ణ సంతోషం లభిస్తుందని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో వేయబడిన పందిరిలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారం మూడో రోజుకు చేరు కున్నాయి. ఈ సందర్భంగా శామ్యూల్ కిరణ్ తన వాక్యోపదేశం కొన సాగిస్తూ... ప్రభువుని స్థిర హృదయంతో హత్తుకొనడం ద్వారా మనలో ఉన్న మాలిన్యం తొలగి పరిపూర్ణ వ్యక్తులుగా మారతామన్నారు. మానవ శరీరంలో అవయవాలన్నీ ఒకే రీతిలో సమిష్టిగా, శ్రద్ధగా పనిచేస్తాయో అదే మాదిరిగా ప్రతి క్రైస్తవ విశ్వాసి భాగస్వామ్యం కలిగి సంఘాల అభి వృద్ధికి దోహదపడాలని పిలుపు నిచ్చారు. నేటి సమాజంలో నిరాశ, నిరుత్సాహం, అభద్రతాభావం వంటి అంశాలతో అనేక మంది ప్రజలు మనోవేదనతో ఉన్నారని తెలిపారు. బైబిల్ గ్రం థంలో ఉన్న బర్నబా అవలంబించిన ఉత్తమ లక్షణాలను, లక్ష్యాలను ఉదహరించారు. దాతృత్వం కలిగిన దాతగా, నమ్మకమైన స్నేహితుడిగా, క్షమాగుణం కలిగిన వ్యక్తిగా, నిత్యం ప్రోత్సాహం అందించే వ్యక్తిగా ఉన్నారని వివరించారు. నేటి సమాజంలో ఉన్న ప్రజలు ఇతరులపై ప్రేమ కనబరు చుట, సత్కా ర్యాలు చేయుట, సహవాసం, స్నేహభావం, సత్ భక్తి, సమాధానంతో పాటుగా పరస్పరం ప్రోత్సహించుకునేందుకు, దాతృత్వం చేసేందుకు నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. మరనాత నామస్మరణతో మహోత్స వాల ప్రాంగణం మారు మోగింది.

### రజతోత్సవం

బైబిల్ మిషన్ అధ్యక్షుడు, పెదకాకాని స్వస్థిశాల నిర్వాహకుడు జె. శామ్యూల్ కిరణ్ మహోత్సవాల నిర్వహణ బాధ్యతను చేపట్టి ఈ సంవత్స రానికి 25 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సంద ర్భంగా రజతోత్సవం నిర్వహించారు. ప్రార్థనలు చేశారు. తొలుత కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. బైబిల్ మిషన్ వైస్ ప్రెసిడెంట్ పీ జాన్ దేవదాసు ప్రార్థన చేశారు.

బైబిల్ గ్రంథంలోని ఏలియా ప్రవక్త గురించి వివరించారు. ప్రపంచ ప్రజలను మేలుకొలిపేందుకు ఈ మహోత్సవాలు దోహద పడతాయ న్నారు. జాయింట్ సెక్రటరీ జే ఆగమనరావు ప్రసంగిస్తూ దేవుని ఆరాధించేవారు కృతజ్ఞత భావం కలిగి ఉండాలన్నారు. ఏసుప్రభువును వెంబడించిన శిష్యులు తగ్గించుకొని ధన్యులయ్యారని, అదే మాదిరిగా ప్రతి ఒక్కరూ తగ్గింపు జీవిత కలిగి ఉండాలని సూచించారు. అనంతరం జే. వినోద్ కుమార్, పాస్టర్లు జీ శామ్యూల్, వీ సతీష్ బాబు దైవ సందే శాలు అందించారు. కాగా, బైబిల్ మిషన్ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి.



హైవే పెగ్ మార్కింగ్ వద్ద అధికారులు, రైతులు

# నకరికల్లు అడ్డరోడ్డు - చీరాల ఓడరేవు 167ఏ హైవే పెగ్ మార్కింగ్ ప్రారంభం

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నరసరావుపేట మండలం రావిపాడు వద్ద మంగళవారం నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు 167ఏ హైవే పనులు ప్రారంభమయ్యాయి. ముందుగా రావిపాడు సచివా లయంలో రైతులతో గ్రామ సభ నిర్వహించారు. సభలో తాహశీల్దార్ కే వేణుగోపాలరావు, హైవే డీఈ శ్రీనివాస రావు, ఏఈ ప్రకాష్, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొ న్నారు. 167ఏ హైవే బాధితరైతులతో చర్చించారు. వారి అనుమానాలను నివృతి చేశారు. రావిపాడు వద్ద హైవే అధికారులు 3డీ కోసం పెగ్ మార్కింగ్ పనులు డ్రోన్‌లు ఉపయోగించి చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 167ఏ నకరికల్లు అడ్డరోడ్డు-చీరాల ఓడరేవు హైవే, నరసరావుపేట మండలంలో ఐదు గ్రామాల నుంచి వెళుతుందన్నారు. కొన్ని ఇబ్బం దులు ఉన్నప్పటికీ పెగ్ మార్కింగ్ చేసేందుకు రైతులు గ్రామసభలో అంగీకరించినట్లు చెప్పారు. 3డీ ఫిబ్రవరి 22కు అయిపోతుందని, ఈ లోపు రోడ్డు విస్తరణలో భాగంగా పెగ్‌మార్కింగ్ రావిపాడు, గుంటగార్లపాడులలో ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రెండు రోజుల్లో జొన్నలగడ్డ, కేసానుపల్లి, ఇస్సపాలెంలో పెగ్‌మార్కింగ్ ప్రారంభం కానున్నట్లు చెప్పారు. నష్టపరిహారం మార్కెట్ విలువ ప్రకారం పట్టణంలో రెండు రెట్లు, గ్రామాలలో 2.5 రెట్లు అధికంగా చెల్లిస్తారన్నారు. బాగా నష్టపోయేవారికి 10 నుంచి 15 శాతం వరకు అధికంగా చెల్లించేందుకు ఉన్నతాధికారులతో చెప్పారని అన్నారు. కార్య క్రమంలో బాధిత రైతులు, ఇతర అధికారులు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధ్యక్షుడు పూదోట ఆంథోని సునీల్ కుమార్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ సభలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కే వేణుగోపాలరావు, హైవే అధికారులు శ్రీనివాసరావు, ప్రకాష్, పోలీసు అధికారులు

# రంగురాళ్ళ కోసం వెళ్లి కెనాల్‌లో గల్లంతు

● బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఘటన



మహమ్మద్ తాజుద్దీన్ (ఫైల్ ఫోటో)

నకరికల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రంగురాళ్ల కోసం తన స్నేహి తులతో కలిసి వెళ్లిన యువకుడు, వాటిని కడిగేందుకని వెళ్లి కెనాల్‌లో కాలు జారిపడి కొట్టుకుపోయాడు. ఈ సంఘటన మండలం త్రిపు రాపురం కొండకు సమీపంలోని బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో మంగళ వారం జరిగింది. ఈ సంఘటనకు సం బంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఫిరంగిపురంలో నివసించే మహమ్మద్ తాజుద్దీన్, గుంటూరులోని సుభానీ హోటల్‌లో క్యాషియర్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం సెలవుదినడం కావడంతో తన స్వగ్రామ మైన పిడుగురాళ్ళకు వచ్చాడు. తన స్నేహితులు నాదెండ్ల రవి చంద్ర, షేక్ జానీ బాషా, షేక్ అబూ బకర్‌లతో కలసి త్రిపురాపురం కొండ వద్దకు రంగురాళ్ల కోసం వెళ్లారు. అక్కడ కొన్ని రాళ్ళను ఏరుకున్నారు. ఆ రాళ్లను శుభ్రంగా కడిగేందుకని అక్కడికి సమీ పంలో ఉన్న బెల్లం కొండ బ్రాంచ్ కెనాల్ వద్దకు తాజుద్దీన్ వెళ్లాడు. పాచిపట్టి ఉండటంతో కాలు జారి కాలువలో పడిపోయాడు. ఇది గమనించిన అతని స్నేహి తుడు రవిచంద్ర కెనాల్‌లో దూకి తాజుద్దీన్‌ను రక్షించేందుకు ప్రయత్నం చేశాడు. కొంత దూరం వరకు రవిచంద్ర ఈత కొట్టుకుంటూ వెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. తాజుద్దీన్(32) నీటిలో మునిగి పోయాడు. రవి చంద్ర ఈత కొట్టుకుంటూ ఒడ్డుకు చేరాడు. గల్లంతైన తాజుద్దీన్ కోసం పోలీసులు చర్యలు చేపట్టారు. తాజుద్దీన్ భార్య, ఒక పాప ఉన్నారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తుతెలియని మృతదేహం



రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి) : మండలంలోని కొత్తపలి సమీపంలోని పొలాల్లో గుర్తుతెలియనివ్యక్తి మృతదేహాన్ని రైతులు మంగళవారం ఉదయం గుర్తించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు తెలిపారు. ఎస్ఐ సీహెచ్ మణి కృష్ణ వివరాలు సేకరించారు. రూరల్ సీఐ రామకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బురదలో కూరుకు పోయి ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి శరీరంపై బ్లూ రంగు టీ షర్టు ఉంది. క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440796247 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## మిర్చియార్డు అధికారులకు సీఎం అభినందన

● రైతులకు ఉచిత భోజనంపై 'ఎక్స్' వేదికగా సందేశం




మిర్చి యార్డు అధికారులను అభినందిస్తూ 'ఎక్స్' వేదికగా సీఎం చంద్రబాబు చేసిన పోస్ట్

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు (మార్కెటింగ్) అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అభినందిం చారు. ప్రస్తుత మిర్చి సీజన్‌లో రైతులు ఇబ్బంది పడకుండా ఉదయం అల్పాహారం, మధ్యా హ్నం భోజనం ఉచితంగా పంపిణీ చేస్తున్నందుకు 'ఎక్స్ 'వేదికగా సీఎం అభినందిస్తూ ఒక పోస్టు చేశారు. ఇది కాసేపట్లోనే వైరల్‌గా మారింది. భోజనంతో పాటు కేవలం రూ. 2 నామమాత్ర రుసుంతో సెంట్రలైజ్డ్ ఏసీ సదుపాయం కలిగిన విశ్రాంతి గదులను అందుబాటులోకి తీసు కొచ్చిన విషయాన్నిరైతు కడుపు చల్లగా' అనే శీర్షికతో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'లో ప్రసారం చేసిన కథనాన్ని చంద్రబాబు వీక్షించి తన స్పందనని ఎక్స్‌లో తెలియ జేశారు. స్వయంగా సీఎం చంద్రబాబు తమని అభినందించడంతో మార్కెటింగ్ శాఖాధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## హెచ్‌ఎంతో సహా ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

గుంటూరు (విద్య )జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెనాలి అయితానగర్ లోని నన్నపనేని సీతారామయ్య, సరస్వతమ్మ మున్సిపల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ డీఈఓ సివి రేణుక మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పౌర సరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ తనిఖీ సమయంలో ఒకేసారి ఏడుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఎఫ్ ఏ3 పరీక్షలు ఉన్న సమయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీంతో పాఠశాల హెచ్‌ఎంతో పాటు ఏడుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## రిజర్వ్‌డ్ కేటగిరి మద్యం దుకాణాలకు దరఖాస్తులు

● స్వీకరణకు చివరి తేదీ ఫిబ్రవరి 5
● నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ

నరసరావుపేట లీగల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నూతన మద్యం పాలసీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 335 షాపులను ప్రభుత్వం రిజర్వ్ కేటగిరికి కేటాయించినట్లు నరసరావుపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ కే మణికంఠ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 13 మద్యం దుకాణాలను రిజర్వ్‌డ్ కేటగిరికి కేటా యించినట్లు తెలిపారు. వీటిలో 9 దుకాణాలను గౌడ కమ్యూనిటీకి, నాలుగు దుకాణా లను గౌడ్ కమ్యూనిటీకి కేటాయించి నట్లు తెలిపారు. అరు లైన, ఆసక్తి గలవారు తమ కుల ధ్రువీకరణ పత్రం, నేటివిటీ సరిఫికెట్ లతో ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.నాన్ రిఫండబుల్ ఫీజు కింద రూ. 2 లక్షలను డీడీ లేదా చలనా లేదా చెక్కురూపంలో చెల్లించాలని వివరించారు. రిజ ర్వ్‌డ్ కేటగిరి షాపులకు ఫీజు జనరల్ కేటగిరి షాపులో సగం మాత్రమే ఉంటుం దన్నారు. ఈ మేరకు షాపులు కేటాయించి నాలుగు నెలలు కావడంతో ప్రస్తుతం షాపులు పొందిన అనంతరం 2024-25 సంవత్సరానికి సంబంధించి ఫీజు కింద డ్రాలో గెలుపొందిన వారు రూ. 21 లక్షల 66, 667 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ అరుణ్ బాబు షాపులకు డ్రా తీస్తారని తెలిపారు. కాగా నర్స రావుపేట మున్సిపాలిటీ పరిధిలో గీత కార్మికుల విభాగం కింద గౌడ్ కులానికి ఒక షాప్ కేటాయించినట్లు నరసరావుపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ సోమయ్య తెలిపారు. అప్లికేషన్ ఫీజు రూ. 2 లక్షలు నాన్ రిఫండబుల్ అని తెలి పారు. ఒక వ్యక్తి ఎన్ని దర ఖాస్తులు దాఖలు చేసినా ఒక షాప్ మాత్రమే కేటాయిస్తారని తెలిపారు. ఎక్సైజ్ ఏఈ ఎస్ రవీంద్ర పాల్గొన్నారు.



ల్యాప్ ట్యాప్‌ను అందుకుంటున్న కిరణ్మయి, పక్కన రైల్వే అధికారులు

## చోరీకి గురైన ల్యాప్‌ట్యాప్ స్వాధీనం

దాచేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జన్మభూమి ట్రెయిన్‌లో సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు ప్రయాణిస్తుండగా రైలులో చోరీకి గురైన ల్యాప్ ట్యాప్‌ను రైల్వే పోలీసు అధికారులు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. స్థానిక రైల్వే అధికారులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 23న బాపట్లకు చెందిన చింతల కిరణ్మయి, భర్త బోసుబాబుతో కలసి సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు జన్మభూమి జనరల్ బోగీలో ప్రయాణిస్తున్నారు. మార్గ మధ్యంలో పిడుగురాళ్ళ రైల్వే స్టేషన్ దాటిన తరువాత గుర్తుతెలియని దొంగలు ల్యాప్ ట్యాప్‌ను దొంగిలించినట్టు గుర్తించిన వారు, నడికూడి రైల్వే పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. రైల్వే పోలీసు, బీఎస్ఆర్‌పీ గుంటూరు సబ్ డివిజన్ ఐఆర్‌పీ గుంటూరు లైన్ సర్కిల్ ఆదేశాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ల్యాప్ ట్యాప్‌ను దొంగిలించిన ప్రాంతం నుంచి రైల్వే పోలీసులు, సాంకేతిక టెక్నాలజీతో ఛేదించి, చోరీకి గురైన ల్యాప్‌ట్యాప్‌ను బాధితులకు అందజేశారు. నడికూడి రైల్వే పోలీసు స్టేషన్‌లో ల్యాప్ ట్యాప్ అందించిన వారిలో ఎస్ఐ బీ శ్రీనివాసరావు నాయక్, ఏఎస్ఐ ఏ వెంకటరావు, కానిస్టేబుల్ సరికొండ రామ రాజు ఉన్నారు. ల్యాప్ ట్యాప్‌ను అందజేసిన అధికారులకు బాధితులు, వారి కుటుంబ సభ్యులు ధన్య వాదాలు తెలిపారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 123.132.142 |
| చికెన్ విత్ స్కిన్ | 230.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 240.00 |

## 1,15,612 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,20,808 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,15,612 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ అంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 70,694 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర | వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | | **ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 7500 | 14000 | 334 | 8000 | 13500 |
| నెంబరు. 5 | 9000 | 13800 | నెంబరు.5 | -- | -- |
| 273 | 8500 | 13000 | 273 | -- | -- |
| 341 | 8000 | 15000 | 341 | 10000 | 11500 |
| 4884 | 7700 | 12500 | 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- | సూపర్ 10 | -- | -- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | | **ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 7000 | 15000 | తేజ | 9000 | 14000 |
| బ్యాడిగి | 7000 | 13000 | బ్యాడిగి | 9500 | 11000 |
| దేవనూరు డీలక్స్ | 9000 | 13200 | దేవనూరు డీలక్స్ | -- | -- |
| తెల్లకాయలు | 4000 | 11500 | తెల్లకాయలు | 5000 | 8500 |

# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



### పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 36.22 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు విడుదల అవుతున్నాయని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్ల రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 33బై11కేవీ రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తుండడంతో సబ్‌స్టేషన్ పరిధిలోని రాయవరం, కంభంపాడు, ముత్యాలంపాడు, గోపాలపురం గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ రామయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఫిబ్రవరి 1 నుంచి రీసర్వే

దుర్గి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండల పరిధిలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రైతుల భూముల రీసర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ ఫణీంద్రకుమార్ తెలిపారు. మండల కేంద్రమైన దుర్గిలో మంగళవారం రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిపారు.

### ఉత్తమ ఫలితాలు సాధించాలి

వెల్దుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీటీడబ్ల్యూవో జోత్స్న అన్నారు. మండలంలోని శిరిగిరిపాడులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆమె సందర్శించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పింఛన్ లబ్ధిదారుల విచారణ

నకరికల్లు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి రూ.15వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగుల వైద్య ధ్రువీకరణ పత్రాలను వైద్యాధికారుల బృందాలు మంగళవారం తనిఖీ చేశాయి. గుండ్లపల్లి, నకరికల్లు, త్రిపురాపురం, కండ్లకుంట నరసింగపాడు, చేజర్ల, చల్లగుండ్ల, దేవవరం రూపెనగుంట్ల, తురకపాలెం గ్రామాల్లో మొత్తంగా 54 పింఛన్‌లను వైద్యాధికారుల బృందం తనిఖీ చేసింది. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ బాలూ నాయక్ ఎంపీడీవో, ఈవోఆర్‌డీ, ఏపీఎం, సీసీలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించాలి

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని 14వ మైలు సెంటర్‌లో జరిగిన రహదారి విస్తరణ పనులలో తొలగించిన బస్టాండ్‌ను తిరిగి నిర్మించాలని స్థానికులు మంగళవారం తహశీల్దార్ డానియేలుకు వినతి పత్రం అందజేశారు. 14వ మైలు సెంటర్‌నుండి సమీప 6గ్రామాల ప్రజలు ప్రయాణాలు చేస్తుంటారని గతంలో బస్టాండ్ ఉన్న స్థలంలో ఆక్రమణలు జరిగాయని వాటిని తొలగించి బస్టాండ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసనాయక్, విఘ్నేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### యువతిపై దాడి ఘటనలో కేసు

పిడుగురాళ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ అటవీ ప్రాంతంలో సోమవారం ప్రేమికుల మధ్య జరిగిన వాగ్వివాదంలో యువతిపై దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎస్ వెంకట్రావు తెలిపారు. నిందితుడు మల్లికార్జునరావు మద్యం తాగి బాధితురాలిపై దాడి చేసిన ఘటనలో ఆమెకు గాయాలు కాగా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

వెల్దుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలుగుయువత నేత మందలపు రామకృష్ణ పశుపోషకులకు సూచించారు. మండలంలోని బోదలవీడులో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో ఆరోగ్యంగా ఉన్న దూడలను ఎంపికచేసి వాటి యజమానులకు బహుమతులు అందించారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులతో పాటు స్టీల్ క్యానులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసరావు, పశువైద్యాధికారిణి హరిత, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు ప్రారంభం

దాచేపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగార్లపాడు పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులను పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి మంగళవారం ప్రారంభించారు. గ్రామంలో సిమెంట్ రోడ్లు, మినీ గోకులాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీవో కే మల్లికార్జునరావు, ఏఈపీఆర్ శ్రీనివాస నాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యులు పురంశెట్టి పరంజ్యోతి, కోరె రామారావు, టీఏ మీరావలి, క్షేత్ర సహాయకులు వెంకటేష్, హుస్సేన్‌లు పాల్గొన్నారు.

### పంట నమోదు చేయించుకోండి

మాచవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కే రామమ్మ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని తురకపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కంది, వరి, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలను ఆమె పరిశీలించారు.

## బాల్య వివాహం బిడ్డల ఆరోగ్యంపై ప్రభావం

- బరువు తక్కువతో పుడుతున్న పిల్లలు
- 18 యేళ్ల లోపు బాలికలకు వివాహాలు వద్దు
- సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ సుజాత

సత్తెనపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాలు పుట్టే బిడ్డల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గర్భిణీలకు తగిన పౌష్టికాహారం అందిస్తున్నప్పటికీ, బాల్యవివాహాలను నియంత్రిస్తున్నప్పటికీ ఎక్కడో ఏదో ఒక లోపం కారణంగా సత్ఫలితాలు రావడం లేదు. బాల్య వివాహాలు తెరచాటుగా జరగటం, గర్భిణీలకు పౌష్టికా హారం అందించటంలో వైఫల్యం వంటివి పుట్టబోయే బిడ్డలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. బాల్యవివాహాల కారణంగా శిశువులు తక్కువ బరువు, నెలలు తక్కువతో పుట్టడం వంటివి జరుగుతున్నాయి.

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు సత్తెనపల్లి, ముప్పాళ్ళ రాజుపాలెం, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన గర్భిణులు ప్రసవాలకు వస్తుం టారు. ప్రతి నెల 120 నుంచి 130 వరకు ప్రసవాలు ఏరియా వైద్యశాలలో జరుగుతున్నాయి. పుట్టబోయే శిశువు కనీసం 2.5 కిలోలలకు పైగా బరువు ఉంటేనే ఆరోగ్యంగా ఉన్నట్లని వైద్యులు చెపుతున్నారు. ఆ బరువు కంటే తక్కువగా కొందరు బిడ్డలు పుడుతు న్నారు.


ఆస్పత్రిలోని నవజాత శిశువుల స్థిరీకరణ యూనిట్‌లో శిశువులు

సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో 2024 జనవరి నెలలో 12, ఫిబ్రవరి నెలలో మూడు, మార్చి లో ఐదు, ఏప్రిల్‌లో 18, మే నెలలో 15, జూన్‌లో 20, జూలైలో 17, ఆగస్టులో 15, సెప్టెంబరులో 12, అక్టోబరులో 12, నవంబరులో 16, డిసెంబరులో 10 మంది పిల్లలు 2.5 కిలోల కంటే తక్కువ బరువుతో పుట్టారు.

**పోషణాలోపం, బాల్యవివాహాలే కారణం..**
**- డాక్టర్ సుజాత,**
**సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రి సీనియర్ గైనకాలజిస్టు**



పోషణ లోపం, బాల్య వివాహాల కారణంగా శిశువులు తక్కువ బరువుతో లేదా నెలలు తక్కువతో పుడుతున్నారు. ఈ శిశువుకు భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. గర్భదారణ కాలం కంటే శిశువు త్వరగా జన్మించినప్పుడు కూడా బరువు తక్కువగా ఉంటారు. 18 సంవత్సరాల వరకు ఆడ పిల్లలకు వివాహం చేయకూడదు. వివాహం చేసినా గర్భం వెంటనే ధరించ కుండా జాగ్రత్త వహించాలి.

## రైతు బంధు పథకం ద్వారా రుణాలు

**కుంభా ఈశ్వరరావు,**
**క్రోసూరు మార్కెట్ యార్డు కార్యదర్శి**

ఫటా ఫట్



క్రోసూరు, జనవరి28 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా రైతులకు రైతు బంధు పథకం కింద రుణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని క్రోసూరు మార్కెట్ యార్డు కార్యదర్శి కుంభా ఈశ్వరరరావు వెల్లడించారు. మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ కార్యదర్శితో ఆంధ్రజ్యోతి ప్రతినిధి ఫటాఫట్ ఇంటర్వ్యూ..

**ప్రశ్న : రైతు బంధు పథకం అమలు చేస్తున్నారా? రైతులకు రుణాలు ఇస్తున్నారా?**

**జవాబు :** మార్కెట్ యార్డులో రైతు బంధు పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. రైతుల వ్యవసాయ దిగుబడులను యార్డులోని గిడ్డంగుల్లో నిల్వ ఉంచేందుకు అవకాశం ఇచ్చాం. నిల్వ ఉంచిన రైతు దిగుబడులకు వాటి విలువలో 75 శాతం రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం.

**ప్రశ్న : క్రోసూరు మార్కెట్ యార్డు మార్కెట్ చెస్ లక్ష్యం ఎంత? ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారు?**

జవాబు : ఇక్కడి చెస్ లక్ష్యం రూ 2.12 లక్ష్యంగా ఉంది. ఇప్పటి వరకు 50 శాతం అంటే రూ 1.05 కోట్లు వసూలు చేశాం.

**ప్రశ్న : .జొన్న, మొక్క జొన్న, పసుపు కొనుగోళ్ళ ఆలోచన ఉందా?**

జవాబు : యార్డు ద్వారా ఇప్పటికే సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. జొన్న, మొక్క జొన్న, పసుపు కొనుగోళ్ళు చేసే విషయంలో అధికారుల నుంచి ఆదేశాలేమి లేవు. ధాన్యం కొనుగోళ్ళు, రైతు సేవా కేంద్రాలు నిర్వహిస్తున్నాయి.

**ప్రశ్న : యార్డు ఆధ్వర్యంలో నడిచే పశువుల సంత ఆదాయం ఎలా ఉంది?**

జవాబు : పశువుల సంత ద్వారా తమ హయాంలో ఆదాయం మరింత పెరిగింది. గతంలో రూ 16 లక్షలు ఉన్న ఆదాయాన్ని రూ 21 లక్షలకు పెంచాం. యార్డులో దళారులను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించటం లేదు.

**ప్రశ్న : యార్డు ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు ప్రతిపాదనలు ఎంత వరకు వచ్చాయి?**

జవాబు : యార్డు ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేసే ఆలోచన ఉన్న మాట వాస్తవమే. గతంలో కొన్ని చర్యలు కూడా తీసుకున్నాం. పాలక వర్గం నియామకం జరిగిన తర్వాత ఆలోచించే అవకాశం ఉంది. కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు ప్రతిపాదన ప్రస్తుతానికైతే లేదు.

**ప్రశ్న : యార్డులో చాలా సౌకర్యాల వినియోగం ఉందా ?**

జవాబు : అన్ని సౌకర్యాలు వినియోగంలోనే ఉన్నాయి. ప్రతి గురువారం జరిగే సంత సందర్భంగా షాపులను ఉపయోగిస్తున్నారు. రైతుల విశ్రాంతి మందిరాలు, గోడౌన్‌లు అన్ని వాడుకలోనే ఉన్నాయి. మంచి నీటిట్యాంకులకు ఇటీవల మరమ్మత్తులు నిర్వహించి వినియోగంలోకి తీసుకు వచ్చాం.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరా పశు సంపద

- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడి
- కానుకమాత తిరునాళ్ళ సందర్భంగా ఎడ్లపోటీలు ప్రారంభం

రెంటచింతల,జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పశుసంపద భారతీయ జీవన వ్యవస్థలో ఒక భాగమని గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నముకని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు.మంగళవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో కానుకమాత 175వ తిరునాళ్ళను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అనంతరం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అందుకనే గోకులాల నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. కార్యక్రమంలో విచారణగురువులు వై.పీటర్‌పాపయ్య, వైఎల్ మర్రెడ్డి, ఎలీషారాజ్, కమిటిసభ్యులుపాల్గొన్నారు. ఫాతిమా విద్యానికేతన్ చెందిన చిన్నారులు ప్రదర్శించిన నాటిక ఆలోచింప చేసింది. ఎమ్మెల్యే జూలకంటి ఆ చిన్నారులకు ప్రోత్సాహకంగా రూ.10 వేలను అందజేశారు.

**రెండు పళ్ల విభాగంలో సత్తెనపల్లి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి..**

ఎడ్ల బండ లాగుడు పోటీలు రెండు పళ్ల విభాగంలో నల్లబోతు ప్రవీణ్‌కుమార్ (సత్తెనపల్లి, రామకృష్ణాపురం)రేపల్లెకు చెందిన బి.నాగరాజులక చెందిన ఎడ్ల జత



ఎడ్ల పోటీల ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

3600 అడుగులు లాగి మొదటి బహుమతిని, మాదలకు చెందిన జవ్వాజి మేఘనాద్ ఎడ్ల జత 3359.3 అడుగులు లాగి 2వ బహుమతిని, మోపర్తి నవీన్‌కుమార్(తక్కెళ్ళపాడు)హరిబాబుకు చెందిన ఎడ్ల జత 3300 అడుగులు లాగి 3వ బహుమతిని, బి.విజయలక్ష్మి.(ఆకీవీడు) ఎడ్లజత 3251 అడుగులు లాగి 4వ బహుమతిని, పేరుమాళ్ళ సంజయ్‌కుమార్ (నంద్యాల) ఎడ్ల జత 3221.6 అడుగులు లాగి 5వ బహుమతిని, మల్లిబోయిన నాగార్జున(గిద్దలూరు) ఎడ్ల జత 3163 అడుగుల దూరం లాగి 6వ బహుమతిని గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## అందుబాటులో లింగ నిర్ధారిత పశు వీర్యం

- పశు సంవర్థక శాఖ ఏడీఏ వీరయ్య వెల్లడి


లేగదూడల ప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచిన దూడ యాజమానికి బహుమతి అందజేస్తున్న ఏడిఏ వీరయ్య

రాజుపాలెం, జనవరి28 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత పశువీర్యం అందుబాటులో ఉందని, దాని ద్వారా 90 శాతం ఖచ్చితత్వంతో మేలుజాతి పెయ్య దూడలను పుట్టించవచ్చని ఏడీఏవీరయ్య తెలిపారు. మంగళవారం రాజుపాలెం గ్రామంలోని ప్రాంతీయ పశువైద్యశాల ఆవరణంలో మేలు జాతి లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ లింగనిర్ధారిత పశు వీర్యం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ మేలుజాతి పెయ్య దూడలు పుట్టించవచ్చన్నారు. ఇంజక్షన్ వెల రూ.500 ఉంటుందని, ఈ అవకాశాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో కూటమి నేతలు పులిబండ్ల సాంబయ్య, చొక్కా గాలయ్య పాల్గొన్నారు. అనంతరం ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలలో నిలిచిన లేగ దూడల యాజమానులకు బహుమతులు అందజేశారు.

### వైద్యశాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన..

రాజుపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో నూతన ప్రాంతీయ ఆస్పత్రి నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని నరసరావుపేట పశు పంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీ.రామారావు ఆదేశించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రమాద భరితంగా ప్రాంతీయ పశువైద్యశాల భవనం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. స్థానిక ఏడీఏ వీరయ్యకు ఫోన్ చేసి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు తయారుచేసి పంపాలని కోరినట్లు పీ. రామారావు తెలిపారు.

### కార్యకర్తలకు అండగా టీడీపీ

బెల్లంకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కార్యకర్తలకు అండగా టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామ టీడీపీ కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి అన్నారు. మంగళవారం గ్రామానికి చెందిన పుల్లల చెరువు శ్రీనివాసరావు మృతిచెందగా, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు బద్దూరి వీరారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కంది కనీస మద్దతు ధర రూ.7,550

దాచేపల్లి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో, రైతుసేవా కేంద్రాల ద్వారా కంది పంటను కనీస మద్దతు ధర రూ.7,550 లకు కొనుగోలు చేస్తున్నట్లు దాచేపల్లి ఏవో పాపకుమారి మంగళ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మైక్రో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఐదెకరాల లోపువున్న రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు ఏవో పాపకుమారి తెలిపారు.


అన్నదానం చేస్తున్న డాక్టర్ ప్రేమ తదితరులు

### ఏరియా ఆస్పత్రిలో అన్నదానం

సత్తెనపల్లి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జనసేన నేత అప్పాపురపు నరేంద్ర ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఏరియా వైద్యశాలలో డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్, ప్రేమల ఆర్థిక సహకారంతో 120 మందికి నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పోతుగంటి రామకోటేశ్వరరావు, పోతుగంటి నరసింహారావు, పులిపాటి శ్రీరామమూర్తి, ధూపగుంట్ల జానకి రామారావు, చేపూరి శ్రీనివాసరావు, ఏ రాజశేఖర్, దివ్వెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### బాలికలకు సైకిళ్ల పంపిణీ

అచ్చంపేట, జనవరి28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు జడ్పీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్న ముగ్గురు బాలికలకు స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా మంగళవారం సైకిళ్ళను అందించారు. ఈ బాలికలు ప్రతి రోజూ ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న జడపల్లి తండా నుంచి మాదిపాడు పాఠశాలకు నడుచుకుంటూ వస్తున్న విషయాన్ని తెలుసుకున్న స్నేహ హస్తాల ఫౌండేషన్ వారు ఆ ముగ్గురు బాలికలకు రూ. 20 వేలు ఖరీదైన సైకిళ్ళను కొనుగోలు చేసి అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అంకమరావు, మన్నెం భద్రయ్య, పోలిశెట్టి పుల్లారావు కొలగాని కుమారి, స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లా బాబు తదితరులు పాల్గొన్నారు.


కిసాన్ డ్రోన్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

### కిసాన్ డ్రోన్‌లపై రైతులకు అవగాహన కల్పించాలి

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జనవరి 28(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం మండల వ్యవసాయశాఖ ద్వారా మంజూరు చేస్తున్న కిసాన్ డ్రోన్‌లపై రైతులకు అవగాహన కల్పించాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం నరుకుళ్లపాడు, ఎనికపాడు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని కిసాన్ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. మండలానికి 3డ్రోన్‌లు మంజూరైనట్లు ఏవో అహ్మద్ ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

**సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత..**

మండల పరిధిలో ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.4.48 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగం డైయిరీ డైరక్టర్ వలివేటి ధర్మారావు, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది విష్ణు, భాష్యం జగదీష్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

క్రోసూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 88 తాళ్ళూరులోని జడ్పీహైస్కూల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను మాజీ జడ్పీటీసీ సభ్యుడు జీ.బాలరామకృష్ణంరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావులు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసమ్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ వాసా భద్రయ్య, మాజీ సర్పంచ్ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కారంపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇనుపరాజుపల్లెలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో గురపుసాల శ్రీనివాసరావు, రాజనాల కొండలు, జినుగు నాగరాజు, కోటేశ్వరరావు, చల్లా సుబ్బయ్య పాల్గొన్నారు.

### నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలి

గురజాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గురజాల సబ్ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను గ్రామ రెవెన్యూ సహాయకులచే భర్తీ చేయాలని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడు బందగి సాహెబ్ కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏవో మేరికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా నైట్ వాచ్‌మెన్, అడెండర్ పోస్టులు ఎన్నో ఏళ్లగా ఖాళీగా ఉన్నాయని, వెంటనే భర్తీచేయాలని ఆయన కోరారు.



రాజుపాలెం మండలంలోని కొండమోడు, వీరమ్మ కాలనీకి చెందిన ముస్లింలు మంగళవారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను రాజధాని అమరావతి సచివాలయంలోని ఆయన చాంబర్‌లో కలిశారు. మసీదు, ఈద్-గాహ్ కబరస్తాన్ ప్రహరి నిర్మాణ నిమిత్తం నిధులు మంజూరు చేయాలని టీడీపీ నేతలు షేక్ బాబు, షేక్ నన్నే, అంకాళ్ల ప్రభుదాసు కోరారు. **- రాజుపాలెం**

### గీత కార్మికులకు మూడు మద్యం షాపులు

- ఫిబ్రవరి 5 నాటికి దరఖాస్తు చేసుకోండి ... ఎక్సైజ్ సీఐ వెల్లడి

మాచర్లటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మాచర్ల పట్టణ, మండల, దుర్గి మండల గ్రామాల గీత కార్మికులకు ప్రభుత్వం మూడు మద్యం షాపులు మంజూరు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాచర్ల పట్టణంలో 1, మండల పరిధిలో 1, దుర్గి మండలంలో 1 చొప్పున షాపులు మంజూరయ్యాయన్నారు. గౌడ సామాజికవర్గం వారు ఫిబ్రవరి 5వ తేదీ నాటికి ఈ షాపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, 7వ తేదీ డ్రాలో గెలుపొందిన వారికి షాపు కేటాయింపు జరుగుతుందన్నారు. దరఖాస్తు రుసుం రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. లైసెన్సు కింద మాచర్ల పట్టణ, రూరల్ పరిధిలో రూ. 21,66,667, దుర్గి మండల పరిధిలో రూ.18,33,334 చెల్లించాలన్నారు. దరఖాస్తు దారులు నేషనాలిటి ఇంటిగ్రిటీ, కుల ధ్రువీకరణ పత్రాలతోపాటు రెవెన్యూ కార్యాలయం నుంచి సప్లిమెంటరీ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలని సీఐ తెలిపారు.

### సాగునీటి కోసం రైతుల ఆందోళన


- కస్తల మైనర్ వద్ద నిరసన.. అధికారుల హామీతో విరమణ

అచ్చంపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని వేల్పూరు సమీపంలో గల కస్తల మైనర్ వద్ద కస్తల మైనర్ కాలువ కింద ఉన్న పలువురు రైతులు మంగళవారం రోడ్డుపై బైటాయించి ఆందోళన చేశారు. కాలువ కింద వందలాది ఎకరాలు మిర్చి, పొగాకు, జొన్న పైర్లు సాగవుతుండగా కాలువకు సమయానికి నీరు రాక పోవటంతో నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. పైర్లు చివరిదశలో ఉన్నాయని, నీరు లేక నాశనం అవుతున్నాయని, అధికారులకు తెలిపినా పట్టించు కోవటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు స్పందించి పైర్లకు నీరు అందేలా చూస్తామని హామీ ఇవ్వండంతో రైతులు ఆందోళన విరమించారు.

### వ్యక్తిపై కత్తులతో దాడి


దుర్గి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆస్థి వివాదాల నేపథ్యంలో వ్యక్తిపై కత్తులతో దాడిచేసిన సంఘటన మండలంలోని పోలేపల్లిలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన వినుకొండ రమణకుమారికి ఆమె బావ వినుకొండ కాశయ్యకు మధ్య కొంత కాలంగా ఆస్థి తగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వారివురి మధ్య గ్రామంలో ఘర్షణ ఏర్పదగా, రమణకుమారికి మద్దతుగా నిలిచిన ఆమె సోదరులు జల్లెడ లక్ష్మీనారాయణ, ఏడుకొండలుపై కాశయ్య, ఆయన కుమారులు గోపి, వినయ్‌లు కత్తులతో దాడి చేశారు. ఈ సంఘటనలో లక్ష్మీనారాయణకు తీవ్రంగా, ఏడుకొండలుకు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే వారిని వైద్య చికిత్స నిమిత్తం మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం


వృద్ధురాలి మృతదేహం

మాచర్లటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వృద్ధురాలు మృతదేహం లభ్యమైన సంఘటన మంగళవారం మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. 80 యేళ్ల వయసు పైబడిన వృద్ధురాలు మృతదేహం పట్టణంలోని బొంబాయి కంపెనీ బ్రిడ్జి వద్ద ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వృద్ధురాలు రెండు రోజుల క్రితం మృతిచెందినట్లు తెలుస్తోందని, ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పట్టణ సీఐ ప్రభాకరరావు కోరారు.

## మహా శివరాత్రి ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సత్రశాలలో ఫిబ్రవరి 26న నిర్వహించనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చేపట్టే ఏర్పాట్లపై మంగళవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దేవాదాయ ఈవో గాదె రామిరెడ్డి అధ్యక్షతన సంబంధిత శాఖల అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్, వైద్యశిబిరం, తాగునీటి ఏర్పాటు, ప్రయాణ, పార్కింగ్, గజఈతగాళ్ల ఏర్పాటు, అన్నదాన సత్రాల నిర్వాహకులకు పాస్‌ల జారీ, దేవుని దర్శనం, పుణ్య స్నానాల వద్ద మహిళలకు ప్రత్యేక క్యూ, మద్యనిషేధం, శాంతి భద్రతలు వంటి అంశాలపై చర్చించి తగు ఆదేశాలను జారీ చేశారు. ఈ అంశాల ఏర్పాట్లలో ఏవైనా సందేహాలుంటే నేరుగా తనను సంప్రదించాలని అధికా రులకు సూచించారు.

ముందుగాఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సమావేశంలో ఆర్డీవో మురళీ కృష్ణ, తహశీల్దార్ నగేష్, పరాశక్తి సిమెంట్స్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు, ఎస్ఈ వెంకటరమణ, ఎంపీడీవో సరోజనిదేవి, ,ఆర్ఐ పల్లా రామకృష్ణ, టీడీపీ నేతలు అబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి

పెదకూరపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పెదకూరపాడులో సీపీఐ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 10వ తేదీ కలెక్టర్ కార్యాలయంలో ఇళ్ళ స్థలాల అర్జీల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీ వర ప్రసాదు మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఐ నాయకులు కాసా రాంబాబు, అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్ చంద్ర, జ్యోతి శ్రీ, కొమ్మాలపాటి కోటేశ్వరరావు, చల్లపల్లి పానయ్య, మాదినేని సుధాకర్, అంబటి సుధాకర్, నాగుల్ మీరా, అల్లాబక్షు, మల్లినేని బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వినుకొండే లక్ష్యం

**రూ.159 కోట్ల పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి తాగునీరు**

**3000 గృహాల నిర్మాణం.. పేదలకు నివేశ స్థలాల పంపిణీ**

**అక్షరం అండ.. పరిష్కారమే అజెండా వేదికగా జీవీ హామీలు**

వినుకొండ, నరసరావుపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'గ్రేటర్ వినుకొండే లక్ష్యం. చుట్టపక్కల ప్రాంతాలను విలీనం చేసి వినుకొండను మహా పట్టణంగా తీర్చి దిద్దడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాను. రూ.159 కోట్ల వ్య యంతో నిలిచిపోయిన తాగునీటి పథకాన్ని పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని అందిస్తా. ఎన్టీఆర్ టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం. 3000 గృహాలు నిర్మిస్తాం. పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేస్తాం.' అని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనే యులు తెలిపారు. గాయత్రీనగర్‌లో పర్యటన అనంతరం ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా వేదికపై జీవీ ప్రసంగించారు. వీధుల్లో పర్యటన, ప్రజల నుంచి అర్జీల స్వీకరించిన అనంతరం ఆయా సమ స్యలపై ఆయన స్పందిస్తూ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా మని భరోసా ఇచ్చారు. వినుకొండలో అక్షరం అండగా.. పరిష్కా రమే అజెండాగా.. కార్యక్రమాన్ని నిర్వహించినం దుకు ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని 23, 31 వార్డుల్లో అధికారులతో కలిసి జీవీ పర్యటించగా పలువురు

**అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..**

సమస్యలపై వినతిప త్రాలు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను జీవీతో పాటు అధికారులకు ప్రత్యక్షంగా చూపారు. మున్సి పల్ అధికారులను, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులను తమ వద్దకు నేరుగా తీసుకొచ్చి సమస్యల పరిష్కార వారధిగా నిలిచినందుకు కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞ తలు తెలిపారు. తాము ఎంతోకా లంగా ఎదుర్కొంటున్న సమస్య లను పరిష్కరిస్తామని జీవీ హామీ ఇవ్వడం ఎంతో సంతో షంగా ఉందన్నారు. సమస్యలపై బాధితుల అభిప్రాయాలు.


31వార్డుల్లో డ్రెయినేజీని పరిశీలిస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

### ఇళ్లలోకి వర్షపు నీరు



చిన్నపాటి వర్షం వచ్చినా ఇళ్లలోకి మురుగు నీరు వస్తుంది. గుంటి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి మురుగునీరు పెద్ద మసీదు మీదగా మార్కాపురం రోడ్డుకు ప్రవహించాలి. డ్రెయినేజీ స క్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరు తుంది. ఎవరికైనా బాగలేకపోయినా అంబు లెన్స్ కూడా రావడానికి సరైన మార్గం లేదు. సమస్యలపై గత ప్రభుత్వంలో ఎన్నో సార్లు చెప్పినా ఫలితం లేదు. కనీసం మీరైన మా బాధను అర్థం చేసుకొని రోడ్డు సౌకర్యం కల్పించాలి.

-పఠాన్ కరీంబీ

### తాగునీరు అందడం లేదు



ఆయుబ్‌ఖాన్ ఇంటి వెనుక బజారకు ప్రధాన రహదారికి ఎత్తులో ఉండడంతో తాగునీరు అందడం లేదు. నీటి కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దనే ఉండాల్సి వస్తుంది.

- షేక్ ఆయూషా

### మౌలిక వసతులు కరువు



మున్సిపాల్టికి పన్నులు చెల్లి స్తున్నాం. కాని మా ప్రాం తంలో మౌలిక వసతులు ఏర్పాటుచేయలేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆంధ్రజ్యోతి చొరవతో అయినా తమకు మౌలిక వ సుతుల ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలి.

- గంగినేని రాఘవ, గాయత్రీనగర్

### పనులు చేపట్టాలి



గాయత్రీనగర్‌లో తాగునీటి సరఫరా కోసం చేపట్టిన రెండు ట్యాంకు నిర్మాణ పనులు గత ప్రభుత్వ హయాంలో అర్థాంత రంగా ఆగిపోయాయి. ఆ పను లు చేపడితే మా ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కార మవుతుంది. వెంటనే ట్యాంకు పనులను చేపట్టాలి.

-కంచుమాటి వీరాంజమ్మ

### రోడ్లు తవ్వి వదిలేశారు


23వ వార్డులో వార్డుల్లో సమస్యలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీకి వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

23వ వార్డులో పెద్ద మసీదు బజారు వ రకు గత ప్రభుత్వ హయాంలో పైపులైన్ల మరమ్మతులు పనుల కోసం సిమెంట్ రోడ్లు, కాల్వలను తవ్వేశారు. పూర్తిగా ధ్వంసం చేశారు. పైపులైన్ల మరమ్మతుల అనంతరం రోడ్లు, కాల్వలను బాగు చేయకుండా వదిలేశారు. రోడ్లు, కాల్వలను బాగు చేసి ఇబ్బందులను పరిష్కరించాలని అప్పటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడ్ని, అధికా రులను ఎన్నిసార్లు కోరినా పొంతనలేని సమాధానాలతో తప్పించుకున్నారు.

-పఠాన్ ఖాశింఖాన్‌బజారు నివాసితులు

### అభివృద్ధి పనులు జరగలేదు

31వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం నుంచి మున్సిపాల్టీకి అత్యధికంగా పన్నులు చె ల్లిస్తున్నాం. పన్నుల చెల్లింపులో మేము ముందున్నాం. కాని సమస్యలను పరిష్కరిం చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారు. వీధిలైట్లు వెలగడం లేదు. వెంచ ర్ నిర్వాహకులు వేసిన సీసీ రోడ్లు తప్ప మున్సిపాల్టీ నుంచి ఒక్క రూపాయతో అభి వృద్ధి పనులు జరగలేదు. తాగునీరు అందని పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

-లక్ష్మీపురంవాసులు


31వార్డుల్లో స్థానిక ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరిస్తున్న జీవీ ఆంజనేయులు

## గత ప్రభుత్వంలో ప్రచార్భాటమే..

**జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి**

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ధాన్యం సేకరణ విషయంలో ప్రతి గింజా కొంటామనే ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది తప్ప అన్నదాతలను ఆదుకోలేదని బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. బాపట్ల కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన డీఆర్సీ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మంత్రులు గొట్టిపాటి, అనగానితో కలిసి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, పక్కన మంత్రులు గొట్టిపాటి, అనగాని

విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాపట్ల జిల్లాలో గత ప్రభుత్వం మద్దతు ధరకు సేకరించిన ధాన్యం కేవలం 7,000 టన్నులేనని, జిల్లాలో ఇప్పటికే 57,000 టన్నుల ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేశామని, మరో 25,000 వరకు ప్రతిపాదనలు పంపామని, అన్నదాతల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులేస్తున్నామని మంత్రి పార్థసారథి తెలిపారు. గత ప్రభుత్వంలో మంచి చేయాలనే తపన లేకుండా పనిచేయడం వల్లనే రెవెన్యూ సదస్సుల్లో పెద్దసంఖ్యలో అర్జీలు వస్తున్నాయని మంత్రి అనగాని తెలిపారు. పరిష్కారం అవకాశం ఉన్నవాటి విషయంలో వెంటనే ఫలితం చూపెడుతున్నామని, దాదాపు 30 శాతం అర్జీల విషయంలో సాంకేతిక పరమైన చిక్కులు ఇమిడి ఉన్నందువల్ల చేయలేకపోతున్నామని అదే విషయాన్ని స్పష్టంగా చెబుతున్నామని, వాటిని పకడ్బందీగా, పారదర్శకంగా పరిష్కరించేలా అన్ని చర్యలు చేపడుతున్నామని మంత్రి అనగాని అన్నారు. ధాన్యం కొనుగోలు ఇంత పెద్ద ఎత్తున ఎప్పుడు జరగలేదని, గత ప్రభుత్వం పెండింగ్ ఉంచిన రూ.1800 కోట్ల బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం అనేది గతంలో ఎన్నడూ లేదన్నారు. ఎక్కడో ఒకటి, రెండు చోట్ల ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన ఇబ్బందులను మొత్తం ప్రక్రియకే అంటగట్టే ప్రయత్నం చేయొద్దని మంత్రి గొట్టిపాటి సూచించారు.

## తపాలా బలోపేతంపై దృష్టి

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని**


ఎర్రబాలెం పోస్టాఫీసు వద్ద స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

మంగళగిరి, జనవరి 28(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖను ఆర్థికంగా బలోపేతం చేయడంపై దృష్టి సారించామని కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కుంచనపల్లి, ఎర్రబాలెంలోని పోస్టాఫీసులను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ శాఖ ఉద్యోగులు, స్థానికులతో పెమ్మసాని చర్చించారు. తపాలా కార్యాలయాలను కాస్ట్ సెంటర్ నుంచి ప్రాఫిట్ సెంటర్లుగా మార్చేందుకు ఏయే చర్యలు తీసుకోవాలనే అంశమై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగుల జీతాలు, ఇన్సెంటివ్‌లు ఎలా అందుతున్నాయి.. ఇన్సూరెన్స్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని సిబ్బందిని మంత్రి ప్రశ్నిం చారు. తపాలా శాఖకు ప్రస్తుతం రూ.13 వేల కోట్ల మేర ఆదాయం వస్తుంటే ఖర్చులు రూ.35వేల కోట్ల వరకు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులలో సంస్థను గట్టెక్కించేందుకు ప్రతీ ఉద్యోగి చిత్తశుద్ధితో శ్రమించి పని చేయాలని సూచిం చా రు. స్థానికులు కూడా మంత్రి పెమ్మసానితో మాట్లాడుతూ తపాలా శాఖ ఉన్నతికి పలు సూచనలను చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, టీడీపీ తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు, జనసేన అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కానుగోలు కోటేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు సత్యనారాయణ, అరుణ, ఆకుల ఉమామహేశ్వరరావు, తపాలా శాఖ సీపీఎంజీ ప్రకాష్, పోస్టల్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి, పోస్టాఫీసు సూపరింటెండెంట్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడో.. రేపో పోలీస్ కార్యాలయానికి డీజీపీ

**ఇంటిగ్రేటెడ్ సీసీటీఎన్ఎస్... సీసీ కెమెరాల సంపూర్ణ పర్యవేక్షణ విభాగాల ఆవిష్కరణ**

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణ, కేసుల చేదనకు సాంకేతిక పరిజ్ఞానం దిశగా పోలీస్ శాఖ మరింత చేరువ అవుతుంది. దీనికి సంబంధించి పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటుచేసిన సీసీ టీఎన్ఎస్ ప్రాజెక్టుతో పాటు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే అందుబాటులో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించి సంపూర్ణ పర్యవేక్షణ విభాగాన్ని డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆవిష్కరించబోతున్నారు. ఇందుకుగాను ఆయన బుధ లేదంటే గురువారాల్లో నగరానికి రానున్నారు. గుంటూరు నగరానికి చెందిన ద్వారక తిరుమలరావు డీజీపీగా ఉన్నారు. ఆయన ఈ నెలా ఖరున ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సొంత గడ్డపై చివరిసారిగా అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొనబోతున్నారు. పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌లో ఆయా అభివృద్ధి కార్యక్రమాలను డీజీపీ ఆవిష్కరించబోతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా సిసిటిఎన్ఎస్ విధానం అమల్లో ఉంది. పోలీస్ స్టేషన్లో నమోదయ్యే ఎఫ్ ఐ ఆర్ లు మొదలు, నిందితుల వివరాలు అలాగే నేరస్తులు, రౌడీ షీటర్లు, తీవ్రవాదులు, మావోయిస్టులాంటి వారందరి ఫోటోలతో సహా డేటాను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్ లో అప్లోడ్ చేస్తున్నారు. సీసీ టీఎన్ఎస్ ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా ఏ నేరస్తుడి గురించైనా చిటికెలో తెలుసుకునే సౌలభ్యం ఉంది. ముఖ్యంగా ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో డేటాను ఆ స్టేషన్ లో క్షణాల్లో తెలుసుకోవచ్చు. అయితే జిల్లాకు సంబంధించిన డేటాతో పాటు సీసీటీఎన్ఎస్ సంబంధించిన వివరాలను పోలీస్ కంట్రోల్ రూమ్ లో తెలుసుకునేందుకు కొంత జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆజాప్యాన్ని నిలుపురించేందుకుగాను సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సాఫ్ట్వేర్ అప్డేట్ చేశారు. ఈ క్రమంలో ఇంటిగ్రేటెడ్ సీసీ టీఎన్ఎస్ విధానాన్ని డీజీపీ ఆవిష్కరించబోతున్నారు.

ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాలు అన్నింటిని ఒక్కొక్కటిగా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే పోలీస్ శాఖ జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. వాటితోపాటు ప్రైవేటు వ్యక్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. వాటన్నింటినీ కూడా పోలీస్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా సీసీ కెమెరాలు కూడా అప్‌డేట్ చేస్తున్నారు. ఆయా సీసీ కెమెరాలన్నింటికి వాయిస్ కమాండ్ ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ.75 నుంచి 80 లక్షల వరకు నిధులు కేటాయించబోతోంది. ఈ క్రమంలో డీజీపీ కంట్రోల్ రూమ్ లోని ఓవరాల్ మానిటరింగ్ సిస్టం కూడా ఆవిష్కరించబోతున్నారు.

## చెన్నైలో కిడ్నాపైన బాలుడు సురక్షితం

**ఐదుగురు నరసరావుపేట మహిళల అరెస్టు**

**ఈ నెల 12న సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో చిన్నారి అపహరణ**

**సీసీ కెమెరాల ఫుటేజ ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

చెన్నై, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఓ బాలుణ్ని కిడ్నాప్ చేసిన కేసులో పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఐదుగురు మహిళల్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి చెర నుంచి ఆ బాలుణ్ని రక్షించారు. అసోంకు చెందిన సచితాబేగం తన ఆరేళ్ల కుమారుడు సకీబుద్దీన్‌తో కలిసి ఈ నెల 12వ తేదీన చెన్నై సెంట్రల్ స్టేషన్ చేరుకున్నారు. సుదూర ప్రయాణం చేసిన ఆమె అలిసిపోయి స్టేషన్‌లోనే బాలుడితో కలిసి నిద్రపోయారు. ఆమె నిద్ర లేచేసరికి సకీబుద్దీన్ కనిపించలేదు. దీంతో సచితాబేగం పోలీసులను ఆశ్రయించారు. సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు.. ఆ బాలుణ్ని ఓ మహిళా ముఠా ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. స్థానిక వ్యాసర్పాడి పోలీసుస్టేషన్ వద్ద నమోదైన సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా బాలుణ్ని కిడ్నాప్ చేసింది చెన్నైలో బిక్షమెత్తుకుంటున్న మహిళా ముఠా అని గుర్తించారు. అనంతరం ఈ నెల 26న నరసరావుపేట వెళ్లిన పోలీసులు.. సరస్వతి, సత్యవతి, వీర అంజమ్మ, ఉమా, అంజమ్మ అనే ఐదుగురు మహిళల్ని అరెస్టు చేశారు. వారి చెరలో ఉన్న బాలుణ్ని రక్షించారు. ఈ ఐదుగురు మహిళలు గతంలోనూ ఇలాంటి కిడ్నాప్ ప్రయత్నాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.


చెన్నై పోలీసులు అరెస్ట్ చేసిన మహిళలు

## పోలీసుల అండదండలతో జోరుగా కోడి పందాలు

రేపల్లె, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తీరంలో సంక్రాంతి పండుగ వెళ్ళినా రేపల్లె నియోజకవర్గంలో కోడిపందాలు జోరు మాత్రం తగ్గలేదు. అధికార పార్టీ నాయకులు, పోలీసుల అండదండలు పుష్కళంగా ఉండటంతో జూద క్రీడలకు తీర ప్రాంతం అడ్డాగా మారింది. కోడిపందాలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం అడవులదీవి, దిండి మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు పోలీసులను అడ్డుపెట్టుకుని జోరుగా కోడిపందాలు కొనసాగిస్తున్నారు. నియోజకవర్గంలోని పందెం రాయుళ్ళతోపాటు కృష్ణ, బాపట్ల జిల్లాల నుంచి పందెంరాయుళ్ళు వేలాదిగా తరలి రావటంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. మంగళవారం భారీగా బరులను ఏర్పాటు చేసి జోరుగా కోడిపందాలు నిర్వహించారు. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మాత్రం రాజకీయ నాయకుల ఆదేశాలకు తలొగ్గి తమ కేమీ పట్టనట్లు మిన్నకుండి పోతున్నారు. దీంతో పందెం రాయుళ్ళు లక్షలాది రూపాయలతో పందాలు కాయడం, జనం పెద్ద సంఖ్యలో ఈ పందాలను వీక్షించారు. వేలాది మంది కోళ్ళు పట్టుకుని పందాలు వేసేందుకు తరలి వచ్చారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరిల్లో జోరుగా కోడిపందాలు నిర్వహించారు. కోడిపందాల రాయుళ్ళు ఒక్కసారిగా గ్రామంలోకి చేరుకోవటంతో వందలాది ద్విచక్ర వాహనాలు ప్రత్యక్షమై ఇసుకవేస్తే రాలనంత జనంలో కోలాహలంగా పందాలు సాగాయి. కోడి పందాల బరుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు బరుల వద్దే జరిగాయి. నిర్వాహకులు కమీషన్ల రూపంలో సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని తీర ప్రాంతవాసులు కోరుతున్నారు.


అడవులదీవి పంచాయతీ శౌంరివారిపాలెంలో కొనసాగుతున్న కోడిపందాలు

## గుంటూరు నుంచి విశాఖపట్నంకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలి

● డయల్ యువర్ డీఎంలో విజ్ఞప్తి

గుంటూరు, జనవరి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి విశాఖపట్నంనకు రాకపోకలు సాగించేందుకు ఏసీ సర్వీసుల సౌకర్యం కల్పించాలని గుంటూరు నగరానికి చెందిన మోహన్‌రావు డయల్ యువర్ డిపో మేనేజర్‌లో విజ్ఞప్తి చేశారు. గుంటూరు-2 డిపో మేనేజర్ డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్ కార్యక్రమం మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గురు ప్రయాణికులు పలు అంశాలపై ఫోన్ చేశారు. మంగళగిరి నుంచి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి - గుంటూరుకు ఉదయం 8.20 గంటల నుంచి 9.20 గంటల వరకు బస్సులే లేవని అసహనం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డీఎం స్థానిక మంగళగిరి డీఎంకు తెలియజేసి పరిష్కరిస్తామన్నారు. అలానే గుంటూరుకు చెందిన జ్ఞానయ్య గుంటూరు నుంచి జూబ్లీ బస్టాండ్‌కు, మేడ్చల్‌కు బస్సులు నడపాలని కోరారు.

## చోరీలతో హడలెత్తిస్తోన్న దొంగల అరెస్టు

**- ఇద్దరూ కడప జిల్లా వాసులే..**

గుంటూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరుస చోరీలతో హడలెత్తిస్తోన్న కడప జిల్లాకు చెందిన ఇరువురు నిందితులను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 28 లక్షల ఖరీదైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సతీష్‌కుమార్ నిందితులను మీడియా ఎదుట హాజరు పరిచి వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన


రికవరీ చేసిన చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అదనపు ఎస్పీ సుప్రజ తదితరులు

దొంగతనాల కేసులకు సంబంధించి సీసీఎస్ పోలీసులు సమగ్ర దర్యాప్తు జరిపి దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించారు. వీరిలో కడప జిల్లాకు చెందిన ఆకుల శ్రీను, మహేష్‌లతో పాటు తమిళనాడు రాష్ట్రం వెల్లోర్ జిల్లా పెర్నంభట్టు మండలం పన్నీర్‌కొట్టై గ్రామానికి చెందిన చంద్రన్ అనే వారు జిల్లాలో చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. ప్రస్తుతం పాత రాజీవ్ గృహకల్ప, అడవితక్కెళ్ళపాడులో ఉంటున్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆకుల శ్రీను, కడప జిల్లా గుమ్మడిన్నె మండలం అశ్వతు గారి పల్లె గ్రామానికి చెందిన నాగ దాసరి మహేష్ అనే ఇరువురిని ఆరు చోరీ కేసుల్లో అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 28 లక్షల ఖరీదైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఆకుల శ్రీను అనే వ్యక్తి పై రాష్ట్రంలోనీ పలు జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 50కి పైగా కేసులు నమోదయ్యాయన్నారు. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో సస్పెక్ట్ షీట్ కూడా ఉందన్నారు. అలాగే నాగ దాసరి.మహేష్ అను వ్యక్తి మీద కూడా రాష్ట్రంలోనే వివిధ పోలీస్‌స్టేషన్లో సుమారుగా 35 కేసులు ఉన్నట్లు తెలిపారు. చంద్రన్ అనే నిందితుడు పరారీలో ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులు చేదించడంలో కృషి చేసిన క్రైమ్స్ అడిషనల్ ఎస్పీ సుప్రజ, సిసిఎస్ డిఎస్పి శివాజీ రాజు , సీఐలు సుబ్బారావు, బత్తుల శ్రీనివాసరావు, అల్తాఫ్ హుస్సేన్ వారి సిబ్బందినీ అభినందించి వారికి ప్రశంసా పత్రాలు అందించారు.

## గోరింకల సందడి



గోరింక.. సందడి.. గాల్లో ఎగురుతూ కరెంటు వైర్లపై కలిసికట్టుగా వాలిన అద్భుత దృశ్యం చూపురలను కట్టిపడేసింది. స్థానిక పత్తిపాడు రోడ్డులోని పొలాల్లో గింజలు తినేందుకు భారీ సంఖ్యలో గోరింక పక్షులు వచ్చాయి. ఇక్కడ విద్యుత్ వైర్లపై బారులు తీరిన దృశ్యాలు ఆకట్టుకున్నాయి. రోడ్డుపై వాహన శబ్దాలకు భారీ సంఖ్యలో పక్షులు గాల్లో ఎగురుతూ ఆకాశంలో అద్భుత దృశ్యాలు ఆవిష్కరించాయి.

- ఆంధ్రజ్యోతి గుంటూరు



## వైభవంగా మాస శివరాత్రి పూజలు

రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి): మండలంలోని విప్పర్ల గ్రామంలోని వల్లభేశ్వరస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి పంచామృతాభిషేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ప్రత్యేక అలంకరణలో వల్లభేశ్వర స్వామి

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట




## ఆంధ్రజ్యోతి ప్రయత్నానికి అభినందనలు

● ఎమ్మెల్యే, అధికారుల క్షేత్రస్థాయి పర్యటనపై హర్షం
● సమస్యల పరిష్కారంపై జీవీ హామీతో ఆనందం
● 23, 31 వార్డుల్లో అక్షరం అండగా.. విజయవంతం



31వ వార్డులో జరిగిన సభలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

**అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..**





జీవీకి స్వాగతం పలుకుతున్న 23వ వార్డు వాసులు

వినుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో అల్లాడుతున్న ప్రజల గొంతుకగా నిలవడమే కాకుండా వారి బాధలను ప్రత్యక్షంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మున్సిపల్ అధికారులకు చూపి పరిష్కారానికి ఆంధ్రజ్యోతి చేసిన ప్రయత్నం విజయవంతమైంది. ఎన్నో ఏళ్లుగా సమస్యలతో అల్లాడుతున్నా ఎవరూ పట్టించుకునే వారు లేరని నైరాశ్యంలో మునిగిన 23, 31 వార్డుల వాసులు ఆంధ్రజ్యోతి కార్యక్రమంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యలపై రెండు రోజులు పత్రికలో ప్రత్యేకంగా ప్రచురించడమే కాకుండా.. తమ వద్దకే ఎమ్మెల్యే, అధికారులను తీసుకువచ్చి సమస్యలను చూపించడంతో పాటు వారి నుంచి హామీలు ఇప్పించడంపై ఆంధ్రజ్యోతికి ఆ ప్రాంతవాసులు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఆంధ్రజ్యోతి వారధి నిలిచినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంతో ఆయా వార్డుల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా.. పేరుతో మంగళవారం వినుకొండలో చేపట్టిన కార్యక్రమంపై పలువురు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు. పట్టణంలోని 23, 31 వార్డుల్లో అధికారులతో కలిసి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా వార్డుల్లో ప్రజల తెలిపిన సమస్యలను పరిష్కరించి, ఆ ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి చూపుతామని జీవీ అభయం ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ సహకారంతో వినుకొండను రాష్ట్రంలో ఆదర్శవంతమైన మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గాయత్రీనగర్ సమీపంలోని కొత్త కాలనీని మున్సిపాల్టీలో విలీనం చేయమని స్థానికుల కోరగా దానిపై జీవీ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. 31వ వార్డులో సీసీరోడ్లు, సైడ్ కాల్వల నిర్మాణాలు, గాయత్రీనగర్‌లో మంచినీట సౌకర్యం కల్పించాలని 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి సతీమణి కృష్ణవేణి జీవీ దృష్టికి తీసుకువచ్చారు.

**జీవీ సహకారంతో అభివృద్ధి: మున్సిపల్ ఛైర్‌పర్సన్**

పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి ఈ పదవి చేపట్టానని అయితే తాను అనుకున్న సంకల్పం గత ప్రభుత్వంలో నెరవేరలేదని కూటమి ప్రభుత్వంలో జీవీ సహకారంతో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టరు దస్తగిరి తెలిపారు. కమిషనర్ సుబాష్ చంద్రబోస్ మాట్లాడుతూ 23, 31వ వార్డుల్లో ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను సాధ్యమైన ంత త్వరలో పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోడపాటి రామారావు, చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్, 23వ వార్డు కౌన్సిలర్ ఎస్కే నన్నేసా, 32వ వార్డు మాజీ కౌన్సిలర్ వాసిరెడ్డి హనుమంతరావు, నరసింహారావు, సౌదాగర్ జానిబాషా, పెమ్మసాని నాగేశ్వరరావు, వంకాయలపాటి పేరయ్య, తూమాటి కాశీశ్వరరావు, కంకణం వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి పిచ్చారావు, గుంటకల అంజి, అనిల్, జాని, బత్తుల శ్రీనివాసరావు, సంపెంగుల ఖలీస్, దూదేకుల కరిముల్లా, గాలి నరసింహారావు, నాగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





గాయత్రీ నగర్‌లో జీవీ ఆంజనేయులును సత్కరిస్తున్న వాసిరెడ్డి హనుమంతరావు, వాసిరెడ్డి కృష్ణవేణి

### రూ.20 వేలతో లైట్లు వేసుకున్నాం..



తాము మున్సిపాల్టి పరిధిలో నివాసం ఉంటున్నప్పటికి అధికారులు తమ సమస్యలపై కనీసం కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. గతంలో మరమ్మతులకు గురికావడంతోయ రూ.20 వేలు సొంత నిధులు వెచ్చించి వీధిలైట్లు నిర్మించుకున్నాం. **- ముత్తినేని వెంకటరమణ**

### సీఎం రిలీఫ్ ఫండ్‌పై హామీ



ప్రమాదంలో గాయపడిన అఫీజ్

23వ వార్డులో నివాసం ఉంటున్న అబ్దుల్ ఆఫీజ్‌కు ఈ నెల 12న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళే స్తోమత లేదని ప్రభుత్వం తరపున ఆదుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని జీవీ ఆంజనేయులుకు విన్నవించుకున్నారు. వైద్య సేవల ఖర్చుల నివేదిక పరిశీలించారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

## పొగాకు బ్యారెన్ దగ్ధం

నూజెండ్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త కొత్తపాలెంలో పొగాకు బ్యారెన్ దగ్ధమై రూ.4లక్షలు ఆస్తి నష్టం సంభవించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఫైర్ అధికారి నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అనుమోలు నాగేశ్వరరెడ్డికి చెందిన పొగాకు బ్యారెన్‌లో అనుమోలు రమణారెడ్డి లీజుకు తీసుకొని బ్యారెన్‌ను నిర్వహిస్తుండగా అగ్ని ప్రమాదం సంభవించటంతో పొగాకు, కర్రలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న వినుకొండ అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది ప్రభాకరరెడ్డి, కోటేశ్వరరావు, రవి కుమార్, బాషాలు మంటలను అదుపు చేశారు.

### లైసెన్స్ ఫీజు చెల్లించాలి

వినుకొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 2025-2026 ఆర్థిక సంవత్సరానికిగాను వ్యాపారులు డీఎంవో ట్రేడ్ లైసెన్స్ ఫీజును తప్పనిసరిగా మునిసిపాలిటీకి చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారులు లైసెన్స్ ఫీజులను తమ పరిధిలోని సచివాలయాలలో కాని పురపాలకశాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక కౌంటర్లలో గానీ చెల్లించాలన్నారు.

### ఏబీవీపీ రాష్ట్ర కోశాధికారిగా కోడూరు

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కోశాధికారిగా కోడూరు సాంబశివరావు నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నూజెల్ల శ్రీనివాస్ మంగళవారం ఆయన నియమాకాన్ని ప్రకటించారు. గత 9 సంవత్సరాలుగా రాష్ట్ర కోశాధికారిగా కొనసాగుతున్న సాంబశివరావు పదో సారి బాధ్యతలు స్వీకరించనున్నారు.

### కోర్టు ఆవరణలో హోమియో వైద్య శిబిరం

నర్సరావుపేట లీగల్, జనవరి 28 (ఆంధ్రజోతి): స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో మంగళవారం మండల న్యాయ సేవాధికార సంస్థ, నరసరావుపేట న్యాయవాద సంఘాల ఆధ్వర్యంలో యూనికేర్ హోమియోపతి సహకారంతో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని 13వ అదరపు జిల్లా న్యాయ అధికారి సత్యశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయధికారులు పూర్ణిమ, మధుస్వామి, పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

### జనసేనలోకి నంది కొండలరావు

వినుకొండ టౌన్,జనవరి28(ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గం వైసీపీ నాయకుడు నంది కొండలరావు మంగళవారం జనసేన పార్టీలో చేరారు. నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను రాయల్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు పార్టీ కండువా కప్పి జనసేన లోకి కొండలరావును ఆహ్వానించారు.

### ములకలూరులో జంతు సంక్షేమ పక్షోత్సవాలు

నరసరావుపేట రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలూరులో మంగళవారం జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా పశువైద్య శిబిరం లేక దూడల ప్రదర్శన నిర్వహించినట్లు పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులం వార్షిక క్షేత్ర సాగు పథకాలను రైతులందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. ఉపసంచాలకులు బాలశంకర్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా 90శాతం కచ్చితత్వంతో పెయ్యదూడలను పుట్టించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మేరీరత్నం, సర్పంచ్ కె రామచంద్రరావు, శ్రీకాంత్, శ్రీధర్‌రెడ్డి, స్వరలత, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల బడిబాట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోటప్పనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో చేరిన విద్యార్థులు

వినుకొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పకొండ చెరువు కట్టపై నివాసం ఉంటున్న 20మంది చిన్నారులకు ఎట్టకేలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సూచనలు మేరకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు అధికారులు కోటప్పనగర్ సమీపంలోగల ఎంపీపీఎస్ పాఠశాల్లో చేర్పించారు. ఈ నెల 22వ తేదీన ఆంధ్రజ్యోతిలో బడిచూడని బాల్యం కథనంపై స్పందించిన తహసీల్దార్ సురేష్‌తోపాటు పల్నాడు జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వరద సుబ్బారావు విద్యాశాఖ అధికారులతో చర్చించి చెరువుకట్ట నుంచి పాఠశాలకు పిల్లలను తరలించేందుకు వీలుగా ఉచిత ఆటోను ఏర్పాటుచేసి పాఠశాల్లో చేర్పించారు. దీంతో ఆ పిల్లల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. నిత్యం చెట్లు పుట్టల మధ్య పెరిగే పిల్లలు నూతన వస్త్రాలతో, చక్కగా స్నానం చేసి పలక బలపం చేతబూని అధికారులు ఏర్పాటుచేసిన ఆటోలో ఎక్కి, ప్రభుత్వం ఇచ్చిన దుస్తులతో చిన్నారులు బడికి వెళుతుంటే ఆ ప్రాంతంలోని పిల్లల తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. అధికారులు హామీ మేరకు ఆధార్‌కార్డులు ఏర్పాటుచేసి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందజేయాలని వారు కోరుతున్నారు.



విద్యాశంకరభారతి మహాస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ దంపతులు

### అగ్రహారం భూముల సమస్యను పరిష్కరించండి

● విద్యాశంకరభారతీ మహాస్వామికి ఎమ్మెల్యే వినతి

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు విద్యాశంకరభారతి మహాస్వామికి విన్నవించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు దంపతులు మంగళవారం హైదరాబాద్‌లో జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానంలో విద్యాశంకరభారతి మహాస్వామిని కలిశారు. స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యను త్వరితగిన తీర్చేలా ఆలోచించాలని కోరారు.

## రైతుల ఆదాయం పెంపొందించేందుకు చర్యలు

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయం పెంపొందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని, దానిలో భాగంగానే పశుపోషణను ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం, లేగదూడల ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రత్తిపాటి ముందుగా వైద్య శిబిరాన్ని, లేగదూడల ప్రదర్శనను ప్రారంభించి లేగదూడలను పరిశీలించారు. అనంతరం జీవాలకు, దూడలకు నట్టల నివారణ మందులను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పశుపోషణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ఉచితంగా వైద్యసేవలు అందించడంతోపాటు, మందులు ఉచితంగా అందజేస్తున్నదన్నారు. అంతేగాకుండా పశుగ్రాసం పెంచేందుకు రాయితీలు కల్పిస్తున్నదన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాక డీడీ రామారావు, యడ్లపాడు ఏరియా వైద్యశాల ఏడీ డాక్టర్ వై రాధాకృష్ణ, ప్రాంతీయ పశువైద్యశాల ఉప సంచాలకులు శ్రీనివాసరావు, ఏపీఎల్‌డీఏ ఈవో డాక్టర్ బాలశంకర్, ఎంపీడీవో హేమలతదేవి, జనసేన నాయకులు టి రాజారమేష్, మాజీ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

**చంద్రబాబు ఆలోచనలన్నీ భవిష్యత్ తరాల కోసమే**

యడ్లపాడు, జనవరి 28: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన, ఆకాంక్షలన్నీ భవిష్యత్ తరాల బాగుకోసమేనని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. లేగదూడల ప్రదర్శనలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో రైతులకు, పశుపోషకులకు ఎలాంటి సహకారం లభించలేదన్నారు. పశువైద్యశాలల్లో కనీస సౌకర్యాలు లేకపోగా, మందులు కూడా అందుబాటులో లేకుండా చేశారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా అప్పులపాలు చేసిన వైసీపీ నేత జగన్ పత్రిక, చానల్‌లో అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు 75 ఏళ్ళ వయస్సులో దావోస్ వెళ్లి చలిలో పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పించి పెట్టుబడులు తెచ్చేందుకు కృషిచేస్తుంటే జగన్ చానల్, పత్రిక మాత్రం రెడ్‌బుక్ అమలు చేస్తున్నారు పెట్టుబడులు ఎలా వస్తాయంటూ దుష్ప్రచారం చేసి రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రం రావణకాష్టంలా మారకూడదనే చంద్రబాబు ఎంతో ఓర్పు, సహనంతో పాలన సాగిస్తున్నారని, భవిష్యత్ ఆలోచించి అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుంటే ఆదాయం పెరగదని, అంతేగాకుండా గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేని పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రజలు చంద్రబాబు ఆలోచనలను అర్థం చేసుకోవాలని కోరారు. జగన్ పత్రిక, చానల్ చేస్తున్న అసత్య ప్రచారాన్ని ప్రతి ఒక్కరూ తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు.

## ఒక్క వాట్సాప్ కాల్ విద్యార్థుల ఆకలితీర్చింది

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఒక్క వాట్సాప్ సందేశం ఇంటర్ విద్యార్థుల ఆకలిని తీర్చిందని, రాష్ట్రం మొత్తం ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి ప్రారంభానికి కారణమైందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సంతోషం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ విద్యార్థులు ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు సందర్భంగా మంగళవారం విద్యార్థులందరూ కలిసి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ వినుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుచేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జీవో నెంబరు 77 ద్వారా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దుచేసిన దుర్మార్గుడు జగన్‌మోహన రెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం ఐదేళ్లలో 20లక్షల మంది ఉద్యోగాలు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని, పంచాయతీరాజ్ మంత్రి పవన్ కల్యాణ్ గ్రామాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, జనసేన నాయకులు నాగశ్రీను, సాగర్, విద్యార్థి నాయకులు రవికుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### విద్యుత్ వైర్లు చోరీ చేస్తున్న దొంగ పట్టివేత

వినుకొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వినుకొండ శివారులోని నాగిరెడ్డిపల్లె సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల భవనంలో కాంట్రాక్టర్లు ఏర్పాటుచేసిన విద్యుత్ వైర్లను ఇద్దరు దొంగిలిస్తుండగా స్థానికులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని విద్యుత్ వైర్లను దొంగిలిస్తున్న ఇద్దరిలో ఒకరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

### 72మంది కృష్ణవేణి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎల్ఈసీఈ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. కళాశాలలో ఎల్‌ఈసీఈ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది. డ్రైవ్‌లో టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్స్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. డ్రైవ్‌లో 124మంది విద్యార్థులు పాల్గొనగా 72 మంది సాఫ్ట్ స్కిల్ ట్రైనర్‌లుగా ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.2.40 లక్షలు వేతనం చెల్లిస్తారని, డిగ్రీ పూర్తయిన వెంటనే విధులలో చేరాల్సి ఉంటుందని హెచ్‌ఆర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను టీపీవో ఎం.బాలకోటేశ్వరరావు, మల్లేష్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

### రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి): మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో శివ లలిత ఈ సందర్భంగా మొక్క జొన్న పొలాలను పరిశీలించారు. యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. అనంతరం రైతులతో సమావేశాలను నిర్వహించారు.

### సంతగుడిపాడు సమీపంలో లారీ బోల్తా

రొంపిచర్ల, జనవరి 28 (ఆంధ్రజోతి): మండలంలోని సంతగుడిపాడు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున లారీ బోల్తా పడింది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పౌడర్ లారీ బోల్తా పడింది. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్టు తెలియవచ్చింది. ఐతే ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయపడ్డాడు.

### ఖననం చేసిన మృతదేహానికి రీ పోస్టుమార్టం

యడ్లపాడు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలం కోట గ్రామానికి చెందిన మహమ్మద్ కరిముల్లా అలియాస్ బాబు (45) గుంటూరు ఆనందపేటలో స్థిరపడ్డాడు. 18 నెలల కిందట మొహర్రం పండుగకు స్వగ్రామమైన కోటకు వచ్చిన ఆయన గ్రామంలోని ఓ బావిలో పడి మృతిచెందాడు. అప్పట్లో మృతుని కుమారుడు సాదిక్ తండ్రి మృతిపై అనుమానంతో యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి పోస్టుమార్టం కూడా చేయించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుంటూరుకు తీసుకెళ్లి ఖననం చేశారు. అయితే మృతుని కుటుంబీకులకు సంబంధించిన ఆస్తుల వివాదం ఉండడంతో తమ తండ్రి మృతిపై అనుమానం ఉందని మత పెద్దలను ఆశ్రయించారు. తిరిగి పోస్టుమార్టం నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు. అయితే మత పెద్దలు అంగీకరించకపోవడంతో మృతుని కుమారుడు హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు రీ పోస్టుమార్టంకు ఈస్ట్ గుంటూరు తహసీల్దార్ నగేష్‌కు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో ఖననం చేసిన మృతదేహాన్ని మంగళవారం వెలికి తీయించిన తహసీల్దార్ నరసరావుపేట డీఎస్పీ కె నాగేశ్వరరావు, ఈస్ట్ తహసీల్దార్ నగేష్, యడ్లపాడు ఎస్ఐ బాలకృష్ణల సమక్షంలో గుంటూరు వైద్య కళాశాల అధ్యాపకుల బృందం రీ పోస్టుమార్టం నిర్వహింప చేశారు.

### మున్సిపల్ కమిషనర్‌కు ఇంజనీరింగ్ వర్కర్ల సన్మానం

వినుకొండ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్‌ను నూతనంగా ఎన్నికైన ఇంజనీరింగ్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం కమిషనర్‌ను కలిసి అభినందించారు. కార్యక్రమంలో ఏఈ ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు బూదాల శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ కార్మిక యూనియన్ అధ్యక్షుడు యం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నాగూర్, సభ్యులు స్వామి, నాసరయ్య, నాగరాజు, ఖాజా, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, చినగాలయ్య, రాములు, కాశిం, రవి, లక్ష్మణ్, సుబ్బారావు, ఖాశీం, శ్రీనివాసరావు, మస్తాన్ తదితరులు ఉన్నారు.

### గీత కార్మికులకు మద్యం షాపు

ఈపూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గౌడ (గీత కార్మికులకు 1 మద్యం దుకాణంకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవచ్చునని సీఐ డీ వెంకటేశ్వర్లు మంగళవారం చెప్పారు. ఇందు కోసం నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు.

### రేపు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

వినుకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 30వ తేదీన వినుకొండ మున్సిపల్ బడ్జెట్ సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సర బడ్జెట్ అంచనాలు, 24-25 సంవత్సరపు సవరించబడిన బడ్జెట్ అంచనా ప్రతిపాదనల గురించి సమావేశంలో చర్చిస్తారన్నారు. ఖర్చులు, ముగింపు నిల్వలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్‌ఛైర్మన్‌లు, కౌన్సిలర్లు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన తెలిపారు.

### నేడు ఒయాసిస్ సేవా సంస్థ వార్షికోత్సవం

చిలకలూరిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఒయాసిస్ సేవా సంస్థ 18వ వార్షికోత్సవం బుధవారం రోటరీ కమ్యూనిటీ హాలులో జరుగుతుందని సంస్థ అధ్యక్షురాలు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మంగళవారం తెలిపారు. 18వ వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ 18 ఏళ్ల క్రితం 11మంది మహిళా సభ్యులతో ప్రారంభమై 160 మందికి చేరుకున్నారన్నారు. ఒయాసిస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చిలకలూరిపేట మండలం మురికిపూడిలో నిరుపేదల కోసం మూడు ఎకరాలలో వృద్ధాశ్రమాన్ని దాతల సహకారంతో నిర్మిస్తున్నామ తెలిపారు. తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 600 కుట్టు మిషన్లు, 400 ట్రైసైకిళ్ళు, 800మందికి ఉపకార వేతనాలు, వెయ్యి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించినట్లు వివరించారు. శాశ్వత ఉచిత కుట్టు మిషన్ కేంద్రం నిర్వహణతో పాటు మహిళలకు క్యాన్సర్ సంబంధిత వ్యాధులపై నిపుణులతో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. విజయవాడ వరద బాధితులకు రూ.5లక్షలు, ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.2 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు చెప్పారు. బుధవారం జరిగే వార్షికోత్సవంలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ పి ప్రఫుల్లాదేవి, కందిమళ్ళ నారాయణమూర్తి పాల్గొన్నారు.

### రాజాపేట స్కూలులో రోటరీ ఆర్వో ప్లాంటు

చిలకలూరిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం రాజాపేటలోని గురుకుల పాఠశాలలోని 400మంది పేద విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు స్థానిక పండరీపురం రోటరీ క్లబ్, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డెక్కన్ సంయుక్తంగా రూ.2.5లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు పాల్‌హారిస్ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఈ ప్లాంటుకు శంకుస్థాపన చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు వారణాసి శరత్‌కుమార్, కార్యదర్శి కొల్లా సుబ్బారావు, క్లబ్ సభ్యులు అలంకార్ మోహన్, ప్రసాద్ రాజు, చెంచుపున్నయ్య, సింగారావు పాల్గొన్నారు.

### 31న వాసవి కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ధర్మ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు సంఘం నిర్వాహకులు మంగళవారం తెలిపారు. చౌత్రా సెంటర్ లోని పాత ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఉదయం మండపారాధన, అభిషేకం, చండీ హోమం, కుంకుమ పూజ జరుగుతుందని, సాయంత్రం అమ్మవారి నగరోత్సవ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

### గాయపడిన కార్పెంటర్‌కు నిత్యావసరాలు అందజేత

తిమ్మాపురం (యడ్లపాడు), జనవరి 28: ప్రమాదవశాత్తూ గాయపడిన కార్పెంటర్‌కు నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసరాలను అందజేశారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం ఎస్సీ కాలనీకి చెందిన చుండ్రు వెంకటరమణ కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. రెండు వారాల క్రితం యంత్రంపై చెక్కలకు చిత్రిక పడుతుండగా ప్రమాదవశాత్తు చేతివేళ్ళు తెగిపోయాయి. రెండు వారాలుగా పనులకు వెళ్ళలేక జరుగుబాటు లేకపోవడంతో ఫౌండేషన్ సభ్యులను సహాయం అర్థించాడు. స్పందించిన ఫౌండేషన్ అధ్యక్షురాలు 25కిలోల బియ్యంతోపాటు కందిపప్పు, నూనె, చింతపండు నిత్యావసరాలను వెంకటరమణ నివాసానికి వెళ్ళి అందజేశారు.

### 24 మంది వాగ్దేవి డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మంగళవారం కాకినాడకు చెందిన ఐఈసీఈ కంపెనీ జాబ్ పెయిర్ నిర్వహించారు. గ్రూప్ డిస్కషన్, జామ్, హెచ్‌ఆర్ రౌండ్‌లు నిర్వహించి 24మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణ పూర్తయిన తరువాత ఏడాదికి రూ.2.50లక్షల నుంచి రూ.3.20లక్షల వరకు వేతనం ఇస్తారని ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ అన్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగాల్లో చేరాల్సి ఉంటుందన్నారు. ప్లేస్‌మెంట్ సెల్ ద్వారా క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు వివిధ ఎంఎన్‌సీ కంపెనీలలో ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తున్నారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు.